₹40
జనవరి – 2024

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

**BALA CHELIMI**

Telugu Children's Monthly Magazine

సంపుటి : 33 • సంచిక : 4

JANUARY 2024




Editor : **Er. VEDAKUMAR MANIKONDA**

A PUBLICATION OF **CHILDREN'S EDUCATIONAL ACADEMY,** HYDERABAD, TELANGANA

# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ
హైదరాబాద్ (Regd. 720/1982)

బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక

## తెలంగాణ బడి పిల్లల కథలు



**10 పుస్తకాల సెట్ ధర రూ.330 • తగ్గింపు ధర రూ. 300**

పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

ఇవి అచ్చంగా మన పిల్లలు రాసిన కథలు, స్వచ్ఛమైన కథలు. 'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ' తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల **"బడి పిల్లల కథలు"** సంకలనాలుగా అందమైన బొమ్మలతో గతంలో వెలువరించింది. అవి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ విశేష ఆదరణ పొందాయి.

అలాగే ఇప్పుడు పిల్లలకోసం తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల బాల సాహిత్య రచయితలు రాసిన **"పెద్దలు రాసిన పిల్లల కథలు"** పది సంకలనాలను అందమైన బొమ్మలతో వెలువరించింది. చిన్నారులు, పెద్దలు, సాహితీ వేత్తలు ఎప్పటివలె ఈ పుస్తకాలను ఆదరిస్తారని ఆశిస్తున్నాం.

-మణికొండ వేదకుమార్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

## పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)



**10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300**



ప్రతులకు
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88
*email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com*



## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు



# బాలచెలిమి

పిల్లల వికాస పత్రిక

# BALA CHELIMI

Telugu Children's Monthly Magazine

సంపుటి: Volume: 33 | సంచిక : Issue : 4 | హైదరాబాద్ Hyderabad | జనవరి January | పేజీలు Pages 52 | రూ. ₹. 40


**లోపలి పేజీల్లో.......**







సరికొత్తగా... ............................ మణికొండ వేదకుమార్ (సంపాదకీయం) ... 5

**కథలు**

అందరూ గొప్పే ............................ దండ్ల ప్రవళిక ............................ 6

స.భో. ............................ వి. రవిశంకర్ ............................ 7

ఓ అమ్మ – ఆవేదన............................ సునీత లకావత్ ............................ 9

సూర్యుడూ బుజ్జి మొక్క ............................ అనువంశీ ............................ 11

జాలరి గంగయ్య – పులి ............................ ఎల్లెల తిరుపతి ............................ 14

శబ్ద కాలుష్యం ............................ ఉమైజ అఫ్షీన్ ............................ 15

భూమి డాక్టర్ ............................ వి. శాంతి ప్రబోధ ............................ 17

తెలివిగలవాడు ............................ జె. నాగసాయి ............................ 19

కష్టేఫలి ............................ ఎ. మౌనిక ............................ 21

దొరకని ఎలుక ............................ కొట్టాల అనూష ............................ 22

సాయ గుణం ............................ యం. దీప ............................ 23

కాలుష్యం ............................ డా. వి.ఆర్.శర్మ ............................ 25

| | | |
|---|---|---|
| అరిసె దెబ్బ ................................ | రమాదేవి బాలబోయిన ................ | 28 |
| మాట వినాలి ................................ | ఎ. అలేఖ్య ............................ | 29 |
| పరివర్తన ................................ | పులి జమున ............................ | 30 |
| అపురూప కానుక ................................ | కె. జ్యోతి ............................ | 33 |
| పరిసరాల పరిశుభ్రత ........................ | ఎ.హెప్సిబ ............................ | 34 |
| చెలిమి – కలిమి ........................ | బొమ్మరిల్లు ............................ | 35 |
| భూమి – విజ్ఞానం ........................ | పుప్పాల కృష్ణమూర్తి .................... | 37 |
| కష్టే ఫలి ................................ | ఎస్. సరళాదేవి ........................ | 39 |
| అపాయంలో ఉపాయం .................... | యన్. లక్ష్మీప్రసన్న .................... | 40 |
| నిజాయితీ ................................ | పి. రేణుక భవాని ........................ | 41 |
| రసగుల్లా రాజ్యం ........................ | చిత్రప్రసాద్ (అనువాదం: డా॥ రోష్నీ) .... | 42 |
| అమ్మమాట ................................ | కన్నెగంటి అనసూయ .................. | 48 |


## పబ్లిషర్స్ నోట్

చెలిమి అంటే స్నేహం. బడిలో చెలిమి.. ఇంట్లో కలిమి... బాల చెలిమి... చదువు కోడానికి పాఠ్య పుస్తకాలు మినహా ఇతర బాల సాహిత్యం అందుబాటులో లేని విద్యార్థుల్లో లోకజ్ఞానం పెంచి, రోజు రోజుకు విస్తరిస్తున్న ప్రపంచ జ్ఞానాన్ని మారుమూల ప్రాంతాలలోని విద్యార్థులకు కూడ ఎప్పటికప్పుడు అందించి వారిని ఎవరికీ తీసిపోని విధంగా తయారు చేసే లక్ష్యంతో ప్రారంభమైన బాలల వికాస పత్రిక 'బాలచెలిమి'. రెండు సంవత్సరములు (2018 నుండి 2020 సం॥) చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ ఎకాడమీ ప్రతి నెలా రెండవ శనివారం 'బాలచెలిమి' ముచ్చట్లు నిర్వహించింది. బాలసాహితీవేత్తలు, ఐ.టి. తదితర రంగాలకు చెందిన సాంకేతిక శాస్త్ర నిపుణులు, సామాజిక, సాహిత్య, సాంస్కృతిక, కళారంగాలకు చెందిన నిష్ణాతులు అనేక మంది తమ తమ అనుభవాలను పంచుకున్నారు. పిల్లల బహుముఖ అభివృద్ధికి తగిన సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో పిల్లల పెంపకంలో అటు తల్లిదండ్రులకు, ఇటు ఉపాధ్యాయులకు బాల చెలిమి చక్కని ఉపకరణంగా ఉండాలనే ఆశయంతో చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ ఎకాడమీ ఈ సంవత్సరం జనవరి నుండి బాల చెలిమిని మరింత ఆకర్షణీయ రంగులతో, విశేషాలతో మీ ముందుకు తెస్తున్నది. బాల బాలికలు, విద్యార్థినీ విద్యార్థుల, తల్లిదండ్రులు, పాఠశాల నిర్వాహకులు, బాలసాహితీ రచయితలు అందరూ 'బాలచెలిమి'ని ఆదరించి, తమ ప్రోత్సాహాన్ని అందించాలని కోరుతున్నాం.




ముఖచిత్రం:
గంగాధర్
బొమ్మలు :
కూరెళ్ల శ్రీనివాస్






**సంపాదకులు : మణికొండ వేదకుమార్**

BALA CHELIMI
**"CHANDRAM"** 3-6-712/2, St.No.12, Himayatnagar,
Hyderabad - 500 029.
e-mail : edit.chelimi@gmail.com, www.balchelimi.com
Mob: 98480 44713

# సరికొత్తగా...

చెలిమి అంటే స్నేహం. బడిలో చెలిమి.. ఇంట్లో కలిమి... బాల చెలిమి... చదువు కోడానికి పాఠ్య పుస్తకాలు మినహా ఇతర బాల సాహిత్యం అందుబాటులో లేని విద్యార్థుల్లో లోకజ్ఞానం పెంచి, రోజు రోజుకు విస్తరిస్తున్న ప్రపంచ జ్ఞానాన్ని మారుమూల ప్రాంతాలలోని విద్యార్థులకు కూడా ఎప్పటికప్పుడు అందించి వారిని ఎవరికీ తీసిపోని విధంగా తయారుచేసే లక్ష్యంతో ప్రారంభమైన బాలల వికాస పత్రిక 'బాలచెలిమి'.

కథ అంటే పిల్లలు చెవి కోసుకొంటారు. కథల పట్ల పిల్లలకున్న ఈ ఆసక్తిని ఆసరాగా చేసుకొని ఎన్నో కథలు వచ్చాయి. వస్తూనే ఉన్నాయి. పిల్లలకు జానపద గాథలంటే చాలా ఇష్టం అనీ, అలాంటి కథలే వాళ్ల మనసులను దోచుకొంటాయనీ ఒక అభిప్రాయం మనలో వేళ్లూనుకొని ఉంది. నిజానికి ఊహాలోకాల్లోకి, స్వప్న జగత్తులోకి ఎగిరి పోవడానికి రంగురంగుల రెక్కలు ఇచ్చే కథల అవసరం ఎంతైనా ఉంది. అలాగే చెవి మెలేసి, జీవితం అంటే ఇదీ, ఇలా వుంటుంది అని కుండ బద్దలు కొట్టినట్లుగా చెప్పే కథల అవసరం అంతకన్నా ఉంది. మారుతున్న విలువలు, వెల్లువలా ముంచెత్తుతున్న నూతన పరిణామాలు పిల్లల మనసుల్లో నాటుకోవాలంటే బాలసాహిత్యం ద్వారా మాత్రమే అది సాధ్యమవుతుందని మా విశ్వాసం.



ఈ నేపథ్యంలో పిల్లల పెంపకంలో అటు తల్లిదండ్రులకు, ఇటు ఉపాధ్యాయులకు బాల చెలిమి చక్కని ఉపకరణంగా ఉండాలనే ఆశయంతో చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ ఎకాడమీ ఈ సంవత్సరం జనవరి నుంచి బాల చెలిమిని మరింత ఆకర్షణీయమైన రంగులతో, ఎక్కువ పేజీలతో, విశేషాలతో మీ ముందుకు తెచ్చింది.

బాల బాలికలు, విద్యార్థినీ విద్యార్థుల, తల్లిదండ్రులు, పాఠశాల నిర్వాహకులు, బాలసాహిత్య రచయితలు అందరూ 'బాలచెలిమి'ని ఆదరించి, తమ ప్రోత్సాహాన్ని అందించాలని కోరుతున్నాం.

వేదకుమార్.యం

– మణికొండ వేదకుమార్,

ఎడిటర్ బాలచెలిమి



# అందరూ గొప్పే



అనగనగా ఒక ఊరు. ఆ ఊరిలో రమ్య అనే అమ్మాయి ఉండేది. నర్సరీ నుండి వేప చెట్టు, జామ చెట్టు, తాటి చెట్టు తీసుకు వచ్చి గుంతలు తవ్వి నాటింది. వాటికి రోజు నీళ్లు పోసేది. మొక్కలు బాగా పెరుగుతున్నాయి. మొక్కల మధ్య గొడవలు వచ్చాయి. నేను గొప్పంటే నేను గొప్పని, గొడవ పెట్టుకుంటున్నాయి. నా పండ్లు చిన్న పిల్లలు, పెద్దలు ఇష్టంగా తింటారు. అడవి పక్షులు అన్ని కూడ ఇష్టంగా తింటాయని జామచెట్టు అంటున్నది.

వేప చెట్టు నేను మాత్రం తక్కువనా!! నా పుల్లల తోటి మనుషులు పళ్ళు తోముకొని, నోరు వాసన లేకుండా చేసుకుంటారు. వేపకాయ అమ్ముకొని ఆయుర్వేద మందులు తయారు చేసుకుంటారు. రోగాలు నయం చేసుకుంటారు. రైతులు నా ఆకులను ఎరువుగా వాడి పంటలు పండించుకుంటున్నారు. నా గాలి ఆరోగ్యకర మైనది. నా నీడ కిందనే ప్రజలు సేదదీర్చుకుంటున్నారని వేపచెట్టు అన్నది.

ఆకాశమంత ఎత్తున ఉన్న తాటిచెట్టు వీటికీ కనువిప్పు కలిగించాలని కిందికి దిగింది. మీరు నిత్యం గొడవ పెట్టుకుంటే లాభం లేదు. ఈ సృష్టికి అందరి అవసరం తప్పనిసరి. ఎవరు లేకున్నా జీవించడం కష్టం. ఒకరికి ఒకరు తక్కువ చేసుకోవద్దని తాటిచెట్టు మంచి మాటలు చెప్పింది. ఆనాటినుండి చెట్లన్ని కలిసి మెలిసి ఉంటున్నాయి.

– దండ్ల ప్రవళిక
ఏడవ తరగతి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
గుర్రాలగొంది.

# స.భో




స్వేచ్ఛ. 4వ క్లాస్ 'బి' సెక్షన్. తనకు ఇష్టం అయిన జంతువు "చేప". చేప జంతువా? అని ఎవరైనా అడిగితే, అంతే...

వారిని కూర్చోబెట్టి "నేలపైన తిరిగే జంతువులే కాదు, నీళ్ళలో కూడా జంతువులు ఉంటాయి అని.. చేప కూడా ఒక నీటి జంతువు అని.. చేపల గురించి, వాటి జీవన విధానం గురించి తను డిస్కవరీ ఛానల్‌లో చూసిన విషయాలు, విశేషాలు అన్ని చెప్తుంది.

ఎవరు కూడా స్వేచ్ఛతో చేపల గురించి మాట్లాడరు ఒక్క తన ఫ్రెండ్ సిద్దు తప్ప.

ఒక రోజు టీచర్ "బర్డ్ మ్యాన్ ఆఫ్ ఇండియా" సలీమ్ అలీ గురించి చెప్పారు. ఆయన ఒక ప్రఖ్యాత పక్షి శాస్త్రవేత్త అని, భారతదేశంలో పక్షి శాస్త్రం గురించి అవగాహన, అధ్యయనం పెంపొందించడానికి కృషి చేశారు అని, పక్షుల గురించి వాటి సహజసిద్ధ ఆవాసాల గురించి, ఆయన రాసిన "ది బుక్ ఆఫ్ ఇండియన్ బర్డ్" గురించి చెప్పారు. పిల్లలందరూ అలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలి అని.. మీరు పెద్దయ్యాక ఏం కావాలి అనుకుంటున్నారు... మీ లక్ష్యం ఏమిటో రేపు క్లాసు లో చెప్పాలి అని అడుగుతారు టీచర్.

టీచర్ సలీమ్ అలీ గురించి చెప్పిన సంగతులు స్వేచ్ఛని బాగా ఆలోచించేలా చేసాయి.

ఇంటికి వెళ్ళే దారిలో తన స్నేహితుడు సిద్ధుతో "సిద్దు... సలీమ్ అలీ పక్షుల గురించి అధ్యయనం చేసినట్టు, ఎవరైనా చేపలపైన చేశారంటావా??

అసలు ఎన్ని రకాల చేపలు ఉన్నాయి... వాటి జీవన విధానం ఏంటి.. అవి ఏమి తింటాయి... వాటి ఇళ్ళు ఎలా ఉంటాయి అని."

"ఏమో స్వేచ్ఛ.. నాకు తెలియదు."

"పోనీ సిద్ధు మనం సముద్రంలోకి వెళ్లి అధ్యయనం చేద్దామా? బర్డ్ మ్యాన్ ఆఫ్ ఇండియాలా.. "ఓషియన్ ఉమెన్ ఆఫ్ ఇండియా – స్వేచ్ఛ" అని పేరు తెచ్చుకోవాలి" సిద్ధు ఏమంటావ్.

"కావాలంటే నువ్వు వెళ్ళు, నాకు ఈత రాదు."

"ఐడియా. పోనీ మనం సముద్రంలో ఒక భోజనశాల ఏర్పాటు చేస్తే.. ఆ రెస్టారెంట్‌లో చేపలకి ఇష్టమైన పాకుడు, వానపాములు ఇలా అన్ని పెడితే వాటిని తినడానికి అవి వస్తాయి కదా. అప్పుడు మనం వాటిని గమనించవచ్చు. ఆ భోజనశాల ఎలా ఉండాలి అంటే ఆల్చిప్ప లతో కుర్చీలు, చిన్న చిన్న గుహలు, ముత్యాలు లాంటి లైట్స్... ఇంకా."

"చాలు చాలు... ఈ రోజుకి... మీ ఇల్లు వచ్చేసింది వెళ్ళు.. రేపు కలుద్దాం... బై.. బై" అని వెళ్ళిపోయాడు సిద్ధు. స్వేచ్ఛ సముద్రంలో భోజనశాల ఉంటే ఎలా ఉండాలి అని ఆలోచిస్తూ నిద్రపోయింది..

× × ×

తర్వాత రోజు పొద్దున్నే లేచి చూస్తే తన మంచం పక్కన.. "ప్రియమైన స్వేచ్ఛ! మీకు స.భోకి స్వాగతం" అని చేప ఆకారంలో ఒక ఆహ్వాన పత్రిక. అది తెరిచి చూస్తే.. "బంగాళాఖాతంలో ఉన్న స.భో – సముద్రపు భోజనశాలలో విందుకు మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాం. మచిలీపట్నం సముద్ర తీరాన రేపు ఉదయం 6 గంటలకు మా "మస్త్య వాహనం" మీకోసం సిద్ధంగా ఉంటుంది"

– ఇట్లు, సముద్ర జీవులు

అది చూడగానే స్వేచ్ఛకి అంతులేని ఆనందం



వేస్తుంది. వెంటనే సిద్ధు దగ్గరికి వెళ్ళి ఆ ఆహ్వాన పత్రిక చూపించి తనతో ఆ "స.భో"కి రమ్మని అడుగుతుంది.

సిద్ధుకి భయం వేసినా.. స్వేచ్ఛ మాట కాదనలేక తనతో కలిసి పొద్దునే అక్కడికి వెళ్తాడు. ఆ స.భో ముత్యంలా మెరుస్తూ ఒక పెద్ద ఆక్టోపస్ ఆకారంలో ఉంది. స్వేచ్ఛని, సిద్ధుని ఆల్చిప్పలతో చేసిన కుర్చీలో కూర్చో పెట్టి వారికి భోజనం తీసుకువస్తాం అని వెళ్ళాయి చేపలు. అక్కడ స్వేచ్ఛ ఎన్నో రకాలైన చేపలు.. ఆక్టోపస్.. తాబేళ్ళు.. డాల్ఫిన్‌ని ఆశ్చర్యంగా చూస్తూ ఆనంద పడుతుంది..

వాటిని చూస్తున్న సిద్ధు "స్వేచ్ఛా నాకు ఒక చిన్న అనుమానం. మనం భోజనంలో చేపలను తింటాం. ఇవి మనల్ని భోజనం చేయడానికి ఇక్కడికి పిలవలేదు కదా. నాకు ఎందుకో భయంగా ఉంది అని" అంటాడు.

సిద్ధు అలా అన్నాడో లేదో "టప్... టప్... టప్" అని పెద్ద శబ్దం... ఏంటి ఆ శబ్దం అని వెనకకి తిరగగానే మనుషులు వాడి పడేసిన ప్లాస్టిక్ డబ్బాలు... రసాయన వ్యర్థాలు... పరిశ్రమల వ్యర్థాలు... చెత్త... అన్ని ఆ భోజనశాల పైన పడుతున్నాయి.

అది చూసి కంగారు పడుతున్న స్వేచ్ఛ, సిద్ధుని చూస్తూ "కంగారు పడకండి, ఇది ఏమి మాకు కొత్త కాదు.. అలవాటు పడుతున్నాం" అని ఆ భోజనశాల శుభ్రపరిచే పనిలో పడిపోయాయి ఆ సముద్రపు జంతువులు..

ఇంతలో డబ్... అని శబ్దం.. స్వేచ్ఛ నెత్తి పైన ఏదో పడింది.. అమ్మా... అంటూ నిద్రలో నుంచి ఉలిక్కిపడి లేచింది స్వేచ్ఛ.. అప్పుడు అర్థం అయ్యింది తనకి... తను ఇప్పటి వరకు కల కన్నాను అని...


తన కల గురించి సిద్ధుకి చెప్పింది.

× × ×

తరువాత రోజు టీచర్ అందరిని మీ లక్ష్యం గురించి చెప్పండి అని అడిగినప్పుడు. "నేను సముద్ర పరిరక్షకురాలిని అవుతాను టీచర్. సముద్ర జీవుల గురించి అవగాహన కల్పిస్తూ, సముద్రాలను శుభ్రంగా ఉంచాలి అని అందరికీ తెలియ చేస్తాను" అని చెప్పింది స్వేచ్ఛ.

– వి. రవిశంకర్,
m : 8438387843

# ఓ అమ్మ - ఆవేదన




మంచు కమ్ముకుంది. కళ్ళకు మబ్బులు పట్టినాయ్. ఏం చేయాలో అర్థం అయితలేదు. ఏ దారినో తెలుస్తలె. ఏందిరా! ఈ గోస. ఏడ జూసినా గదే మంచు కనబడుతున్నది. ఏం చేయాలే. కాళ్లు కదుపుదామన్న వీలు లేకుండా ఉండాది. ఒంటి గంట దాటింది. "అమ్మ భారతి యాడున్నావే జర జల్దీ రా!" ఆ.... నాయనా! అచ్చినావా! గీయాలిటీ దాకా యాడికిపోయేస్తివి. గాడికే అదే మందుల దుకాణంకి పోయస్తిని. ఏమన్నా కావాలా చెప్పు. కాస్త తల నొప్పిగా ఉండాది. గట్ల చల్లగాలికి చెరువు గట్టుకు పోయొద్దాం అని నాయన నేను దారిలో నడుచు కుంటూపోయినాం. చెరువుగట్టున చల్ల గాలికి కూర్చున్నాం చెరువు దగ్గర ఉన్న ఒక నీళ్ల కుంటలో అంతా ప్లాస్టిక్ సంచులు, సీసాలు గివన్నీ కనబడుతున్నాయి. గివన్నిటిని చూసిన

నాయన చానా బాధపడతాండు. ఏందో ఇయాలటి దినం మనుషులు, తాగడానికని నీళ్ల కుంటలు, చెరువులు తవ్వినం. కానీ గీయాలిటీ సంది చెత్తకుంటగా మార్చి నీరుని కలుషితం చేస్తారనీ గాదు. మా కాలంలా గిసుంటివాడలే? కుండల నీరే గొంతుకు చలువగా తాగినం. ఇప్పుడు ఫ్రిజ్లు, ప్లాస్టిక్ బాటిల్లు అని వాడుతుండ్రు. యాడంటే ఆడనే పడేస్తుండ్రు, అని నాన్న అన్నాడు.

అదే సమయంలో చెరువు గట్టున చినిగిన అంగి వేసుకుని నిలబడ్డ పిల్లవాడు కనిపించిండు. ఆడిని చూసి ఈడు యిక్కడెం చేస్తుండు అని నేను నాయనా అడినం.

ఓ... ఎవరు బిడ్డా! నువ్వు గిక్కడేం పని నీకు, అని వెన్ను తట్టి అడిగిండు. తీరా చూస్తే పిల్లగాడు గుక్కపట్టి ఏడుస్తుండు. అరే తమ్మి ఏమైందిరా? ఎందుకు గిట్ల ఏడుస్తున్నావ్ అని అడిగిండు నాయన.

నేను... నేను... నేనండి రవినయ్యా పక్క ఊరి నరసవ్వ కొడుకుని, మేము పేదోల్లం మాకంటూ ఎవరూ లేరయ్యా. నేను మా అమ్మ కూలీ పని చేసుకుంటూ బతుకుతున్నాం. మా ఇంటి చుట్టూ ప్రక్కల మురికి కాలువలున్నాయి. అయ్యా నాకు అక్కడున్న దోమలు కుట్టడంతో కాలు పెద్దగా వాచింది అంతగా పట్టించుకోలేదయ్య. అట్టనే ఇంట్లో ఉన్న. రోజు అమ్మ ఈ చెరువు నీళ్లను మోసుకొచ్చేది. గవే తాగేటోల్లం రెండు దినాలకే నాకు దగ్గు, జ్వరం వచ్చిండాది. అమ్మకు కాళ్ళు చేతులు ఆడలే. పెద్ద ఆసుపత్రికి పోయినం. డాక్టర్ గారు నన్ను చూసి ఏందమ్మా! ఇంత జ్వరం పెట్టుకొని ఆస్పత్రికి రాలే రెండు దినాలు దాటితే నీ కొడుకు చేతికి రాకపోవు అని చెప్పి సూదిచ్చి మందుల చిట్టి రాసిండు. అదనంగా ఇచ్చిండు కానీ నాకు ఈ రోగం చెరువు నీళ్ల వల్లే వచ్చిందని చెప్పిండు. ఈ నీళ్ల వల్ల చుట్టు ప్రక్కల ఉన్న గ్రామాలకి ఈ రోగం సోకి చాలా మంది చనిపోయారు. ఈ విషయాన్ని నేను వెళ్లి మా ఊరి సర్పంచ్ గారికి చెప్తే అంతగా శ్రద్ధ చూపలే సక్కగా ప్లాస్టిక్ తయారు చేసే పరిశ్రమల అధికారులతో మాట్లాడితే ప్రయోజనం కనిపించలే. నాకు అర్థమైందేందంటే మనం స్వచ్ఛందంగా వదిలేస్తే తప్ప ప్లాస్టిక్ మనల్ని వదలదని అనుకున్నాను. ఏమి చేయలేక చనిపోదామనుకున్నా. కనీసం మీరైనా నాకు సహాయం చేస్తారా! పెద్దయ్య. చేస్తాను తప్పకుండా అని నాన్న మాటిచ్చి నాకు బాధ్యతను అప్పగించాడు. నేను ప్లాస్టిక్ తయారీలో వాడే పదార్థాల గురించి సమాచారం తెలుసుకొని ప్లాస్టిక్‌ని మళ్ళీ వాడి పడేయకుండా మళ్ళీ దాన్ని మనం పునఃక్రియ చేస్తే చాలు. అలా చేయకపోతే రవి లాంటి ఎంతో మంది రోగాల బారిన పడి చనిపోతారని పై అధికారులతో చెప్పాను. వారు నా మాటను గౌరవించి మీరు చెప్పినట్టే చేస్తామన్నారు. అలాగే అని ప్లాస్టిక్ తయారీలో 50 మైక్రాన్స్ కంటే తక్కువ కాకుండా ఉపయోగిస్తామని హామీ ఇచ్చారు.

**– సునీత లకావత్**

*ఫోన్: 9493275239*
*sunithalakhavath949@gmail. com*

'మన ఆహారమే మన ఔషధం కావాలి.' ఈ మాట హిప్పొక్రేట్స్ అనే మహానుభావుడు క్రీస్తు పూర్వమే చెప్పారు. సాంకేతికంగా సమాజం ఎంత అభివృద్ధి సాధించినా ఇప్పటికీ ఈ భావనే మానవాళి అంతటికీ ఆచరణీయం కావాల్సి ఉంది.


కథ

# సూర్యుడూ బుజ్జి మొక్క

అనగనగనగా ఒక బుజ్జి మొక్క మొలిచింది. అప్పుడే కళ్ళు తెరిచి చుట్టూ చూసింది. ఎవరూ లేరు, దానికి ఏమీ అర్థం కాలేదు. కొంచం భయం కూడా వేసింది. ఎవరన్నా పలకరిస్తారేమో అని చూసింది. కొంచం దూరంలో ఒక పెద్ద చెట్టు కనిపించింది. చెట్టు నిండా పళ్ళు. చూస్తుంటే నోరూరుతోంది. బుజ్జి మొక్కకి ఆకలి గుర్తొచ్చింది. ఆ చెట్టుని పలకరించబోతే మొహం తిప్పేసుకుంది.

ఏమి చెయ్యాలో బుజ్జి మొక్కకి తోచలేదు. అటుగా వెళ్తున్న ఒక చీమ కనిపించింది. అదేమిటో ఈ బుజ్జి మొక్కకి తెలియదు, కానీ భలే ఉంది, గబాగబా పాక్కుంటూ వెళ్తోందని చూసింది. తను కూడా కదలగలదేమో అని ప్రయత్నించింది. ఊహూ... కదలలేకపోయింది. వెంటనే ఆ చీమని గొంతెత్తి పిలిచింది, “ఇదిగో... నిన్నే, ఓ సారి ఇలా వస్తావా” అంది. చీమ ఓ క్షణం మొక్క కేసి చూసి, ‘‘ఉండవమ్మా... నా పనిలో నేనున్నా... ఆహారం తీసుకురాకపోతే మా రాణీ గారు తంతారు. నేను త్వరగా వెళ్ళాలి, అసలే మబ్బుగా ఉంది” అని వెళ్ళిపోయింది.

బుజ్జి మొక్కకి ఏమి చెయ్యాలో తోచలేదు. కొంచం ఆకలి కూడా వేసింది. ‘ఈ చీమ ఎటో వెళ్ళి ఆహారం తెచ్చుకుంటుంది. నేనేమి చెయ్యాలి? దానికి ఎవరో రాణీ గారు కూడా ఉన్నారుట! నాకెవరు కనపడరే, నాతో ఎవరూ మాట్లాడరే!’ అనుకుంది. దానికి బాధ కూడా వేసింది. ఏమి చెయ్యటమా అని ఆలోచిస్తూ కూర్చుంది.




మర్నాడు పొద్దున్నే మబ్బు వీడి సూర్యుడు

వచ్చాడు. బుజ్జి మొక్కకి ఆ వేడిమికి హాయిగా అనిపించింది. బద్ధకంగా వళ్ళు విరుచుకొని పైకి చూసింది. చక్కటి రంగులో వెలిగిపోతున్నాడు సూర్యుడు. అది చూడగానే పక్క చెట్టుకి వేళ్ళాడుతున్న పండు లాగ తోచింది బుజ్జి మొక్కకి. మళ్ళీ ఆకలి గుర్తొచ్చింది దానికి.

సూర్యుడి వైపు చూసి "ఏయ్ పండూ! నా పేరు బుజ్జి మొక్క. నువ్వెంత బావున్నావో తెలుసా, నీ పేరు మావిడి పండా? నాకు నిన్ను చూస్తుంటే తినాలనుంది" అంది.

ఎవరా మాట్లాడుతోంది అని క్రిందకి చూసిన సూర్యుడు, ఆ బుజ్జి మొక్క తనతోనే మాట్లాడుతోందని చూసి, పలకరింపుగా నవ్వాడు. ఇప్పటికి తనని చూసి ఒకళ్ళు పలకరింపుగా నవ్వారని బోలెడు ఆనందం వేసింది మొక్కకి.

"ఇక్కడికి రా, మనం కబుర్లు చెప్పుకుందాం, నాకెవరూ స్నేహితులు లేరు, నిన్ను తిననులే" అంది. దానికి సూర్యుడు పెద్దగా నవ్వి, "నేను ఇక్కడే ఆకాశంలోనే ఉంటాను, క్రిందకి రాలేను. పైగా నేను తినే పండుని కాదు. నా పేరు సూర్యుడు, నువ్వు నన్ను 'సూర్యా' అని పిలవచ్చు. మనిద్దరం స్నేహితులం ఇంక నుంచి. నీ సంగతులు చెప్పు" అన్నాడు.

దానికి బుజ్జి మొక్క చాలా ఆశ్చర్యంగా "నువ్వు ఆకాశంలోనే ఉంటావా? పండువి కూడా కాదా? భలే ఉందే! నేను నిన్ననే పుట్టాను. నాకెవరూ తెలిసిన వాళ్ళు లేరు, ఎవరి పనుల్లో వాళ్ళు ఉన్నారు. నాకేమో నిన్నటి నుంచి బాగా ఆకలి, ఏమి చెయ్యాలో అర్థం కావట్లేదు. నీకేమన్నా తెలిస్తే చెప్పవా సూర్యా, నా స్నేహితుడువి అన్నావు కదా" అంది జాలిగా.

దానికి సూర్యుడు, "అయ్యో, బాగా ఆకలిగా ఉందా, నేను నీకు నా కిరణాలని ఇస్తాను. దానితో నీ ఆకలి తీరుతుంది చూడు." అన్నాడు.

"కిరణాలా? కిరణాలంటే?" అంది బుజ్జి మొక్క.

"కిరణాలంటే, నా నుంచి వచ్చే వెలుగు అన్న మాట, అది మీ మొక్కలకి ఆహారం" అని నవ్వుతూ తన కిరణాలని బుజ్జి మొక్క మీద ప్రసరింపచేసాడు.

ఆశ్చర్యం, బుజ్జి మొక్క బుల్లి బొజ్జ నిండిపోయింది. "భలే ఉందే, నాకు కడుపు నిండిపోయింది. మరే, నువ్వు రోజూ నాకు ఆహారం ఇస్తావా?" అని అడిగింది బుజ్జి మొక్క.

"ఓ, తప్పకుండా, నా పనే అది కదా, అందరికీ శక్తిని ఇవ్వటం. నేను మళ్ళీ రేపు వస్తాను" అని వెళ్ళిపోయాడు సూర్యుడు.

బుజ్జి మొక్క బొజ్జ నిండింది కదా, హాయిగా బజ్జుంది.

మళ్ళీ మర్నాడు సూర్యుడు వచ్చాడు. బుజ్జి మొక్క, సూర్య కబుర్లు చెప్పుకున్నారు. ఇద్దరూ మంచి స్నేహితులు అయిపోయారు. రోజూ సూర్యుడు కిరణాలతో బొజ్జ నింపుకుంటూ, సూర్యుడితో కబుర్లు చెప్తూ కాలక్షేపం చేస్తోంది బుజ్జి మొక్క.

ఒకరోజు పొద్దున్నే సూర్యుడు వచ్చి బుజ్జి మొక్కని పలకరించాడు. బుజ్జి మొక్క దిగులుగా కనిపించింది. బుజ్జి మొక్కకి తన కిరణాలని ఇవ్వబోతూ, దిగులుకి కారణమేమిటని అడిగాడు సూర్యుడు, దానికి బుజ్జి మొక్క, "ఇవాళ నాకు ఆకలిగా లేదు, నీ కిరణాలు వద్దు. నువ్వు చక్కగా నాలాంటి మొక్కలు ఎన్నిటినో పలకరిస్తావు రోజూ, అన్నిటికీ కడుపు నింపుతావు. కదలలేను మెదలలేను, నేనే ఎవ్వరికీ ఏమీ చెయ్యట్లేదు" అంది బాధగా.

దానికి సూర్యుడు నవ్వి "ఓస్... ఇంతేనా... నువ్వు ఇంక చాలా బుజ్జిదానివి. నువ్వు పెరిగి నీకు ఆకులు పూలు పళ్ళు వస్తాయి చూడు, అప్పుడు ఎంత మందికి

సహాయపడతావో తెలుసా. జంతువులు, మనుషులు ఈ ఆకులు, పళ్ళు తిని ఆనందిస్తారు. పూలతో చాలా అందంగా ఉంటావు. నీ పక్కన ఉన్న ఆ పళ్ళచెట్టుని చూడు, రోజూ దాని మీద పాకే చీమలు, వాలే చిలకలు, పిట్టలు, దాని పళ్ళు కోసుకు తినే మనుషులు, ఎంత ఆనందిస్తున్నారో చూడు. అలా నువ్వు కూడా పెరిగి పెద్దయ్యి నలుగురికీ ఉపయోగ పడతావు" అన్నాడు.

బుజ్జి మొక్కకి ఉత్సాహం వచ్చింది, ''నిజంగానా'' అంది. "నిజమే మరి, దానికోసం, నీ ఆహారం కూడా నువ్వు తయారు చేసుకోవాలి, నేను సహాయం చేస్తాను" అన్నాడు.

"అవునా! నా ఆహారం నేను తయారు చేసుకోవటమా, అది ఎలా?'' అంది బోలెడంత ఆశ్చర్యంగా.

"అవును... నీకు బుజ్జి బుజ్జి ఆకులు వస్తున్నాయి చూడు, నేను ఇచ్చే కిరణాలని నువ్వు కాస్త కాస్త నీ ఆకులలో దాచుకో. భూమిలో ఉన్న బలం, నీళ్ళు కలిపి, క్రింద నీ వేర్లలో బోలెడంత శక్తి ఉంది. ఆ శక్తి, ఆకులలో నేను ఇచ్చే బలం, రెండూ కలిపి నీకు మంచి ఆహారం అవుతుంది. దాని వల్ల నీ ఆకులు బలంగా ఉంటాయి. నువ్వు బలంగా ఉంటావు, మంచి పూలు, పళ్ళు వస్తాయి. ఎంత మందికో నువ్వు ఆహారం ఇవ్వచ్చు. మనుషులు బ్రతకటానికి ప్రాణవాయువుని ఇస్తావు. రోజూ బోలెడన్ని జీవులు నీకోసం నీ దగ్గరకి వచ్చి నిన్ను పలకరిస్తాయి. నువ్వు ఎప్పుడూ పచ్చగా ఉండాలని కోరుకుంటాయి" అన్నాడు.

బుజ్జి మొక్కకి ఆనందంతో కళ్ళు మెరిశాయి. "అబ్బా... నువ్వు చెప్తుంటే ఎంత బావుందో... అలానే చేస్తాను సూర్యా" అంది.

బుజ్జి మొక్క ఇప్పుడు ఎంతో సంతోషంగా ఉంది. దానికి ఇప్పుడు తను చక్కగా పెరిగినట్టూ, ఆవులు, మేకలు తన ఆకులు తింటూ కడుపు నింపుకుంటున్నట్టు,




ఇంకా పెద్దదై, పక్కనే ఉన్న చెట్టంత ఎదిగినట్టూ, ఆ చెట్టు తనని ఆప్యాయంగా పలకరిస్తున్నట్టూ, బోలెడంత మందికి నీడనిస్తూ, తన పళ్ళతో వాళ్ళ ఆకలి తీరుస్తున్నట్టు ఆలోచనలు. బుజ్జి మొక్క మనసుని చదివిన సూర్యుడు, నవ్వుతూ "తథాస్తు!" అన్నాడు.

**– అనువంశీ,**
*ఫోన్ : 8333947019*

# జాలరి గంగయ్య-పులి

అది కార్తీక మాసం ప్రాణహితానది ఒడ్లు దిగి పారుతోంది. బెస్తవాళ్ళంతా రాత్రంతా చేపల (జిమ్మల) వేటకు వెళుతున్నారు. ఒకరోజు నలుగురు బెస్తల గుంపు సాయంత్రం నదికి వెళ్ళి వలలు కట్టి ఆ రాత్రి నది ఒడ్డున బండల మధ్యన కొద్దిపాటి ఇసుక ప్రాంతంలో అగ్గిచేసి ఆ నెగడి చుట్టూరా పడుకున్నారు. అందులో గంగయ్యకు గుర్రుకొట్టే అలవాటుంది. నడిజాము రాత్రి సమయంలో ఒక పులి నీళ్ళు తాగుటకు నదిలోకి వచ్చి నీళ్ళుతాగి నది ఒడ్డు వెంబడి కప్పలతో సయ్యాటలాడుతూ బెస్తలు పడుకున్న వైపుకే వెళ్ళింది.



అందులో గంగయ్య గుర్రూ... గట గటా... అంటూ శబ్దం చేస్తూ నిద్రపోతున్నాడు. పులి ఆ శబ్దం వింటూ వాడి దగ్గరికే వెళ్ళి వాడి తలాపున కూర్చొని తోక ఆడిస్తూ వాడు కదిలితే తినేయడానికి సిద్ధంగా ఉంది.

పులి ఊపుతున్న తోక పక్కకున్న కొద్ది దూరంలో, నెగడుకు దగ్గరగా పడుకున్న రామయ్య మొఖంపై తాకడంతో రామయ్య తెలివైంది. ఆ రామయ్యకు పులిని చూసే సరికి పంచ ప్రాణాలు పైనే పోయాయి. తెలివైన రామయ్య భయంతోనే పులి ఏమి చేస్తుందా అని గమనించాడు. అది గుర్రుకొడుతున్న గంగయ్య తలాపున కూర్చొని ఉంది. గంగయ్య కదిలితే చంపేస్తుంది. ఇప్పుడెలా అని మధన పడుతుండగా తన పక్కలో ఒక కపిస్క (గవ్వ) దొరికింది. దానితో తన మొలతాడును తెంపాడు. నెగడు మద్ది కట్టెలతో ఎర్రని నిప్పులతో కణకణలాడుతుంది.

తన మొలతాడును ఒకవైపు ఎర్రని నిప్పుతో ఉన్న మద్ది కొర్రికి కట్టాడు. ఆ పులి గంగయ్య మొఖం దగ్గర మొఖం పెట్టి వెనక తోకను ఊపుతోంది. రామయ్య చడీ చప్పుడు లేకుండా మొలతాడు రెండవ దిక్కున ఆ పులి తోకకు కట్టాడు. రామయ్య నిండా బ్లాంకెట్ కప్పుకొని బోం.... అంటూ పెద్ద శబ్దం చేస్తూ పైకి లేచాడు పక్కనే ఉన్న పులి ఒక్కసారిగా విన్న ఆ శబ్దానికి చెంగున గంగయ్య ఆవల దుమికింది. రామయ్య కట్టిన కొర్రాయి మిడిసి దాని వీపుకు తగిలింది.

అగ్గితో ఉన్న కొర్రాయి మిడిసి నిప్పులన్నీ వీపుపై రాలాయి అగ్గిమంటతో మళ్ళీ ఎగిరింది. మళ్ళీ తోకకున్న కొర్రాయి మిడిసి కొట్టింది. పులి పెడ బొబ్బలు పెట్టుకుంటూ గాండ్రిస్తూ అడివిలోకి వెళ్ళిపోయింది. రామయ్య ఉపాయంతో గంగయ్య ప్రాణాలు కాపాడాడు. లేకుంటే గంగయ్య కదిలినప్పుడు పులి గంగయ్యను తినేసి ఉండేది.

**-ఎల్లెల తిరుపతి,** వేమనపల్లి

# శబ్ద కాలుష్యం

ఒక పల్లెటూర్లో రాహుల్ అనే ధనవంతుడు భార్య రమణి, పిల్లలు సీత, మహేశ్‌లతో కలిసి నివసిస్తుండేవారు. వాళ్ళ ఇల్లు చాలా పెద్దది. ఆ ఇల్లు పల్లెటూరి శివార్లలో నది దగ్గర ఉండేది. ఎందుకంటే రాహుల్ యంత్రశాల యజమాని. ఆ యంత్రశాల నదికి దగ్గరగా ఉండేది. యంత్ర శాల నుండి వచ్చే వ్యర్థ పదార్థాలు, హానికరమైన పదార్థాలు నదిలోకి పోయేవి.




రాహుల్ దగ్గర ఒక కారు, రెండు బైకులు ఉండేవి. కాని అతడు తక్కువ దారులకు కూడా వాహనాల మీదనే వెళ్ళేవాడు. పిల్లలకు పాఠశాల బస్సులో పంపియ్యకుండా కారులో దింపేవాడు. హానికరమైన పొగను వదలడం వలన వాయు కలుషితం అవుతది. యంత్ర శాలలు కూడా హానికరమైన వాయువులను విడుదల చేసి వాయువుని కలుషితం చేస్తాయి.

కానీ కలుషితమైన వాయువు గురించి భయపడకుండా రాహుల్ వాయు కాలుష్యాన్ని మోసుకెళ్తున్నాడు.

ఆ గ్రామంలో మధ్య తరగతి కుటుంబం వారంతా సేద్యం చేస్తూ నివసిస్తారు. ఒక రోజు మహేశ్ పుట్టినరోజు సందర్భంగా వాళ్ల బంధువులు ఉదయాన్నే వచ్చారు. వాళ్ళు రమణి వాళ్ళ అన్న, వినోద్ కుటుంబ సభ్యులు. ఈ విందుకు హాజరయ్యారు. ఆ విందులో డిజె ఏర్పాటు చేశారు. ఆ చప్పుడుకి చుట్టుప్రక్కల వాళ్ళు తలుపులు మూసుకున్నారు. వినోద్ గమనిస్తూనే ఉన్నాడు.

వినోద్, రాహుల్ "తలుపులు మూసుకున్న ఇళ్ళకు వెళ్ళి "ఏమైందని" అడిగారు. దానికి సమాధానం వాళ్ళు గుండె రోగులని చెప్పారు. డిజె సౌండ్ వలన వాళ్ళ గుండె దెబ్బ తింటుందని సమాధానం ఇచ్చాడు. దీనిని రాహుల్ తట్టుకోలేకపోయాడు. వాళ్ళను క్షమాపణ అడిగి, ఇంటికి వెళ్ళాడు. అతడు వెంటనే వెళ్ళి డిజె ఆపి చిన్న స్పీకర్లలో పాటలు పెట్టుకున్నాడు.

సెలవులలో రాహుల్ కుటుంబ సభ్యులతో సహా వినోద్ ఇంటికి గ్రామానికి వెళ్లారు. రాహుల్ యజమాని ఐన యంత్రశాల కాగితాలు తయారు చేస్తది. చాలా చెట్లను నరకాల్సి వస్తది. ప్రాంగణంలో ఒక్క చెట్టు కూడా లేకుండే అందుకే రాహుల్‌కి వినోద్ మొక్కలు నాటమని చెప్పాడు.

యంత్రశాల చెత్తను నదిలో వదిలి కలుషితం చేస్తున్నారని తెలుసుకొని ప్రసరించే శుద్ధి కర్మాగారం వాడమని సలహా ఇచ్చాడు.

సెలవులు గడిచాయి. అందరూ ఇంటికి తిరిగి వచ్చారు. రాహుల్ వెంటనే ప్రసరించే శుద్ధి కర్మాగారంని కొని, యంత్రశాలలో వాడడం మొదలు పెట్టాడు. ప్రాంగణంలో కూడ మొక్కలు నాటి, ఇంటి పరిసరాలను పచ్చగా చేసాడు. ఏదైనా విందులను నిర్వహించినప్పుడు శబ్దాన్ని తక్కువ చేసి ఎవ్వరికీ భంగం కాకుండా చూసాడు. రాహుల్ యొక్క కుటుంబ సభ్యులు ప్లాస్టిక్ వాడడం కూడా ఎక్కువ శాతం తగ్గించారు. ఇలా వాళ్ళు చిట్కాలను పాటించారు.

ఈ విధంగా రాహుల్, రమణి, సీత, మహేశ్‌లు వినోద్ చెప్పినవన్నీ పాటించి ఎంతో సుఖవంతమైన జీవితాన్ని గడిపారు.

**– ఉమైజ అఫ్షీన్,**
ఫోన్ : 8897786992


చందదారులుగా చేరండి! **బాల చెలిమి** చందదారులను చేర్పించండి!

'ఎం.వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా :**

BALA CHELIMI
**"CHANDRAM"** 3-6-712/2,
St.No. 12, Himayatnagar
Hyderabad - 500 029.
Mob: 9030626288
E-mail:desk.chelimi@gmail.com,
www.balchelimi.com

**చందా వివరాలు :**

| | |
|---|---|
| విడి ప్రతి | : రూ. 40 |
| వార్షిక చందా | : రూ. 400 |
| 2 సం॥లకు | : రూ. 750 |

*'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.*

**ACCOUNT DETAILS :**

| | |
|---|---|
| Bank Name | : Canara Bank |
| A/C No. | : 30101010003714 |
| Branch | : Ashoknagar, HYDERABAD. |
| IFSC Code | : CNRB0013010 |

కథ

# భూమి డాక్టర్

సూర్య చాలా సేపటి నుంచి దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. ఎదురుగా ఉన్న ఎండిపోయిన చెరువు చూస్తూ ఆలోచిస్తున్నాడు. ఎడమవైపు ఫ్యాక్టరీ నుంచి వచ్చే దట్టమైన పొగ చూస్తూ ఆలోచిస్తున్నాడు. ఒకప్పుడు కుడివైపు దట్టమైన అడవి వుండేదని విన్నాడు. ఇప్పుడు చాలా దూరం జరిగిపోయింది. ఆ అడవి నుంచి వస్తున్న పొగను చూస్తూ ఆలోచిస్తున్నాడు.

ఇక్కడ చెరువు ఎండిపోయింది. అక్కడ మామయ్య వాళ్ళ ఊళ్ళో సముద్రం బడిని మింగేసింది. దీనికి కారణం మనుషులే అని అమ్మ చెప్పింది. కొన్ని రోజులు పోతే ఊళ్లకు ఊళ్లే సముద్రంలో కలిసిపోతాయి అంటున్నారు నాన్న.

ఇక్కడ చెరువు కట్టపై చెట్లన్నీ ఎండిపోయాయి. పిట్టలు గూళ్ళను వదిలి ఎటో పోయాయి. చెరువులో చేపలు, తాబేళ్లు, కప్పలు, ఎండ్రకాయులు ఎటుపోయాయో.. నీళ్లు లేక పంటలు లేవు. పంటలు లేక తిండి లేదు. తిండి వెతుక్కుంటూ సగం ఊరు ఖాళీ అయిపోయింది. భూతాపం పెరగడం వల్ల ఒకసారి ముంచెత్తే వానలు, ఇంకోసారి కరువుకాటకాలు వస్తాయని బడిలో టీచర్లు చెప్పారు.

బయట వేడి బాగా పెరిగిపోయింది. వడదెబ్బ కొడుతుంది బయట తిరగొద్దని అమ్మ కట్టడి చేస్తుంది. జాగ్రత్తలు చెబుతుంది. తగిన ఆహారం పెడుతుంది. పాపం, అక్కడ అడవి తగలబడిపోతున్నది. ఆ వేడికి చెట్లు, పుట్టలు, పక్షులు, కీటకాలు, జంతువులు ఎంత




బాధపడుతున్నాయో. వాటికి కావాల్సినవి ఎవరు ఇస్తారు? సూర్యకి చాలా బాధ కలిగింది, ఏడుపొచ్చింది. భూమి వేడెక్కితే సముద్రం, నదులు, అడవులు, పర్వతాలు, పక్షులు, చేపలు, జంతువులు, కీటకాలు వంటి జీవకోటికి కష్టమే అని చెప్పారు టీచర్. మరి ఇవన్నీ బాధపడడానికి, నాశనం కావడానికి కారణం మనిషి అంటున్నారు. భూమి, అడవులు, భూగర్భ

జలాలు, నదులు, సముద్రాలు మనిషి ఒక్కడివే కాదు. అన్ని ప్రాణులవి. మరి మనిషి తనకిష్టం వచ్చినట్లు ఎందుకు ప్రవర్తిస్తున్నాడు? తోటి జీవుల గురించి ఎందుకు ఆలోచించడం లేదు? మన పూర్వీకులు మనకు అప్పగించిన భూమి అందమైనది. దాన్ని అంతే భద్రంగా మనము ముందు తరాల వారికి అప్పగించాలి. ఇప్పుడున్నట్టు ఉంటే ఏమి ఇస్తాం? అసలు ఇవ్వడానికి ఏమి మిగులుతుంది? బురద, బూడిద తప్ప. ఎన్నో లక్షల జీవరాశులలో మనిషి కూడా ఒక జీవరాశి. ఆ ఒక్క మనిషి లేకపోతే అన్ని జీవరాశులు సంతోషంగా ఉండేవాళ్లమని తిట్టుకుంటున్నాయేమో! అనేక ప్రశ్నలు, సందేహాలు పన్నెండేళ్ల సూర్యలో. చీకట్లు ముసురుతుంటే ఇంటికి బయలుదేరాడు. నరికేసిన చెట్ల స్థానంలో చెట్ల కన్నా చాలా ఎత్తైన భవనాలు, అద్దాల భవనాలు ధగధగలాడుతున్నాయి. మేఘాల్ని పిలిచే చెట్లు లేక అవి దూరమై పోయాయి. ఉన్న చెట్లు ఎండి మోడువారి పోయాయి. పచ్చదనం మచ్చుకైనా కనిపించడం లేదు.

వీధులన్నీ విద్యుత్ దీపాలతో వెలుగుతున్నాయి. మోటారు వాహనాలు మోత చేస్తూ పొగ వదులుతూ దూసుకుపోతున్నాయి. ఇంటికి చేరే సరికి నీళ్ల ట్యాంక్ నిండి నీళ్లు పోతున్నాయి. మోటార్ కట్టేసి లోనికి వచ్చాడు. హాల్లో ఎవరూ లేరు. ఫ్యాన్ తిరుగుతూన్నది. టీవీ మోగుతున్నది. వాటిని ఆపేశాడు. అమ్మని నాన్నని పిలిచాడు.

ఏరా ఇప్పటిదాకా ఎటు పోయావ్? వడగాల్పుల్లో తిరగొద్దని చెప్పానా? గద్దించింది అమ్మ. భూతాపం పెరగడానికి కారణం మీరే సీరియస్‌గా అన్నాడు. మేమా.. అన్నారు వాళ్ళు ఆశ్చర్యంగా. అవును, మీరే నీళ్లు, కరెంట్ ఎలా వృధా చేస్తున్నారో. మన అవసరానికి వాడుకోవాలి కానీ వృధా చేయొచ్చా చెప్పండి. మీరు మీ నాన్నల, తాతల తరం భూతాపాన్ని పెంచుతూ పోయారు. అందువల్ల జరిగే నష్టం తెలిసి కూడా చర్యలు తీసుకోలేదు. అదే ఇంత అనర్థం తెచ్చింది. ఇప్పటికీ విపత్తు నెత్తి మీద ఉన్నా సరిదిద్దుకోవట్లేదు అన్నాడు సూర్య. అమ్మానాన్న విస్తుపోయి సూర్యని చూస్తున్నారు.

నేను కూడా మీలాగే ఉంటే నా తర్వాత నా పిల్లలకు, వాళ్ళ పిల్లలకి నిల్చోడానికి భూమి, ఊపిరి పీల్చడానికి గాలి, తాగడానికి చుక్క నీళ్లు ఉండవేమో.. లేకపోతే తుఫాన్లు, వరదలు వచ్చి ముంచెత్తుతాయేమో. మనం బతకాలనుకున్నట్టే భూమి కూడా బతకాలి కదా. మనమేనా ప్రతి జీవి బతకాలిగా. అందుకే ఇకనుంచి భూమి డాక్టర్ కావాలనుకుంటున్నా స్పష్టంగా చెప్పాడు సూర్య. భూమి డాక్టరా? అన్నారు విస్తుపోతూ అమ్మా నాన్న. అవును, భూమిని బాగు చేసుకోవడం కోసం భూమి డాక్టర్ అవుతా. ఏం చేస్తావ్? ఉచితంగా వచ్చే సౌర శక్తిని ఇంట్లో, బయట ఎంత వాడుకోవాలో అంత ఎక్కువ వాడతా. విద్యుత్ వృధా చేయను. కాలుష్యం పెంచే వాహనాలు వీలయినంత వరకు వాడను. నడిచే దూరం అయితే నడుస్తా. లేకపోతే పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వాడతా. ఉన్న చెట్లు నరకను. మొక్కలు పెంచుతా. డాబా మీద కూడా కూరగాయమొక్కలు పెట్టి ఇంటికి వేడి తగ్గిస్తా. మంచి గాలి వచ్చేలా చూస్తా. ఫ్యాన్, ఏసీ వీలయినంత వరకు వాడకం తగ్గిస్తా. ప్లాస్టిక్ సంచుల బదులు గుడ్డ సంచులు వాడతా. వర్షం వచ్చినప్పుడు ఆ నీటిని ఒడిసిపట్టి వాననీటి గుంతలు ఏర్పాటు చేస్తా. తక్కువ నీటితో పండే పంటలు పండిస్తా. అందరూ భూమిని, ప్రకృతిని గౌరవించి బాగు చేసుకునేలా చేస్తా. అమ్మా నాన్నా నాకు ఎంత ఇష్టమో భూమి అంటే కూడా అంతే ప్రేమ. చెప్పుకుపోతున్నాడు సూర్య. ఆశ్చర్యంతో నోరెళ్ళబెట్టి చూస్తున్నారు అమ్మ నాన్న.

**–వి. శాంతి ప్రబోధ,**
ఫోన్ : 9866703223

కథ

# తెలివిగలవాడు




ఒక గ్రామంలో రాజా అనే వాడు ఉండేవాడు. ఇంటి దగ్గర ఉండి చిన్న, చితక పనులు చేసుకుంటూ ఉండేవాడు. ఇతను ఏది అడిగిన , ఏది చెప్పినా లాజిక్‌గా ఉండేవి. అందుకని ఆ గ్రామంలో వాళ్ళు రాజాని "లాజిక్" రాజా అని పిలిచేవారు. ఆ గ్రామంలో ఒక ప్రభుత్వ పాఠశాల ఉంది. ఆ పాఠశాల పున: ప్రారంభం అయింది. రాము అనే కొత్త టీచర్ చేరాడు. ఆ పాఠశాలలోని ఒక ఉపాధ్యాయుడు రాము సార్‌తో ఇలా అన్నాడు.

**ఉపాధ్యాయుడు :** సార్ పాఠశాల పునః ప్రారంభం అయ్యింది. అందుకని మనం "బడిబాట" కార్యక్రమం ప్రారంభించాలి. ఈ గ్రామంలో ప్రతి ఇంటికి తిరిగి పిల్లల్ని మన బడికి వచ్చే తీరుగా మనం చేయ్యాలి.

**రాము సార్ :** సరె! సార్ పోదామ్.

అలా టీచర్లు బయలుదేరి ప్రతి ఇంటికి వెళుతు, వెళుతూ అలా "రాజా" ఇంటికి వచ్చారు.

**ఉపాధ్యాయుడు :** అబ్బో!.... అక్కడ వుంది "లాజిక్" రాజా కదా! అటు వెళ్ళితే మనం బుక్ అయిపోతాము. వాడు అడిగే ప్రశ్నలకు దిమ్మ తిరుగుతుంది.

**రాము సార్ :** ఎందుకు సార్..... అంత బయపడిపోతున్నారు.

**ఉపాధ్యాయుడు :** వాడి గురించి మీకు తెలియదు సార్. మీరు క్రొత్తగా వచ్చారు కదా. రాజా వేసే ప్రశ్నలకు సమాధానం చెప్పలేము. ఏది అడిగినా

"లాజిక్" మిస్‌కాదు. వాడి మాటలకు, ప్రశ్నలతో మన నోట మాట కూడా రాకుండా చేస్తాడు. సార్.

**రాము సార్ :** ఏమిటి సార్? గ్రామంలో చిన్న, చితక పని చేసేవాడికి మనం భయపడడమా? ఇంత చదువుకున్న వాళ్ళం. అతనికి బయపడితే ఎలా సార్. మిమ్మల్ని చూస్తుంటే నవ్వు వస్తుంది సార్.

**ఉపాధ్యాయుడు :** ఇంతకి నువ్వు ఏమంటావ్... వెళ్ళదామ్ అంటావ్ అంతేనా.....

**రాము సార్ :** అవును సార్. ఎంత వ్యక్తినయినా నేను ఈజీగా నా "వైపు" తిప్పేస్తా.

**ఉపాధ్యాయుడు :** "ఏమి తిప్పేస్తావ్! మీరు వాడి వైపు తిరగకుండా చూడండి. మీరు జుట్టు పీక్కోకుండా చూడండి.

**రాము సార్ :** రాజా!...

**రాజా :** నమస్కారం సార్

అలా మాట్లాడుతుండంగా ఉపాధ్యాయుడు మనసులో ఇలా అనుకున్నాడు.

**ఉపాధ్యాయుడు :** వామ్మో పని పెట్టుకొని పులి బోనులో తల పెట్టినట్టు అయ్యింది.

**రాము సార్ :** ఏమ్ రాజా మీ ఇంట్లో పిల్లలు ఉన్నారా!.. ఉంటే మా పాఠశాలలో పంపించండి. మన పాఠశాలను మనం కాపాడుకోవాలి.

**రాజా :** సార్ ప్రభుత్వ పాఠశాలకు ఎందుకు పంపించాలి.

"చెప్పండి సార్!.. చెప్పండి నేను చెప్పినా వినకుండా వెళ్ళారు కదా. ఇప్పుడు జుట్టు పట్టుకుంటున్నారా సార్.

**రాజా :** చెప్పండి సార్!..

**రాము సార్ :** ప్రవేట్ స్కూల్సులో తక్కువ చదువుకున్న వాళ్ళు టీచర్లుగా పని చేస్తారు. కాని ఇక్కడి టీచర్లు అన్ని పరీక్షలు రాసి బాగా చదువుకున్న వాళ్లు ఉంటారు.

**రాజా :** మరీ మీ పిల్లల్ని ఎక్కడ చదివిస్తున్నారు. సార్!

**రాము సార్ :** అదీ! అదీ! ప్రైవేటులో..

**రాజా :** అదేంటి సార్ ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువ చదువుకున్న వాళ్ళు ఉన్నారు అని మీరే చెప్పారు కదా సార్. మరీ తక్కువ చదువుకొని, టీచర్లుగా పనిచేసే వాళ్ళ దగ్గరకి ఎందుకు పంపిస్తున్నారు? అంటే మీరు చెప్పే చదువు మీద మీకే నమ్మకం లేదా?

ఇంతలో అరవింద్ అనే అతను వచ్చాడు.

**అరవింద్ :** రాజా! సార్‌తో అలా మాట్లాడవచ్చా! తప్పు కాదూ. సార్ మా పిల్లల్ని మీ పాఠశాలలో చేర్చుతా. మన పాఠశాలని మనమే కాపాడుకుందామ్.


**రాము సార్ :** అలా కాదు అరవిందు గారు "రాజా" అన్నా దాంట్లో వందశాతం నిజం ఉంది. రాజా అన్నది వాస్తవం. నా కళ్ళు తెరిపించాడు. ధన్యవాదాలు రాజా. నేను నా పిల్లల్ని కూడా ఈ ప్రభుత్వ పాఠశాలలో చేర్చుతా. తరువాత నేను ఈ "బడిబాట" కార్యక్రమంలో పాల్గొంటా అని రాము సార్ వెళ్ళుతూ ఉపాధ్యాయుడుతో ఇలా అన్నాడు.

**రాము సార్ :** సార్ మీరన్నది నిజమే సార్. "రాజా" చాలా లాజిక్‌గా మాట్లాడుతున్నాడు. అవును సార్ చదువుకొకపోయిన ఇలాంటి లాజిక్‌గా మాట్లాడే వారుంటారు సార్!

అలా మాట్లాడుకుంటు పాఠశాలకు పోయారు. తరువాత రాముసార్ తన తోటి ఉపాధ్యాయులతో చెప్పి వాళ్ళ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాడు.

– జె. నాగసాయి, భైరవునిపల్లి

# కష్టేఫలి




కాంచీపురం అనే ఊరిలో శివమ్మ అనే ఆమె ఉండేది. ఆమె ఒక చిన్న పూరింట్లో నివసిస్తుండేది. ఆమె ఎంతో కష్టపడి పనిచేసేది. ఆమెకి ఎప్పుడూ ఒక కోరిక ఉండేది. ఆమె ఒక దుకాణం పెట్టుకొని బాగా సంపాదించాలనుకునేది. ఆమె బాగా పనికివెళ్ళి కష్టపడి సంపాందించుకునేది. వచ్చిన డబ్బును ఒక హుండీలో దాచుకునేది. అలా ప్రతిరోజూ పనికి వెళ్ళి దాచుకునేది. అలా ఒక రోజు ఆమె పనికి వెళ్ళింది. ఆమె ఇంట్లో దొంగలు పడ్డారు. డబ్బులు ఎక్కడున్నాయని ఇల్లంతా వెతికారు. ఎక్కడా డబ్బు కనబడలేదు.

దొంగలు నలుగురు వచ్చారు– అందులో ఒకడు హుండీని చూసి అందులో డబ్బు ఉండోచ్చేమో అని ఆ హూండీని పగలగొడితే అందులో చాలా డబ్బు బయటపడింది. ఆ డబ్బునంతా దోచుకుని వెళ్తుంటే వారికి ఇంకా ఎక్కడైనా డబ్బు ఉండొచ్చేమోనని ఆ పూరిల్లు క్రింద ఉన్న నేలను తవ్వసాగారు. వారికి ఏమీ దొరకలేదు. ఇక వాళ్లు వెళ్లిపోయారు. అప్పుడు శివమ్మ తన పనిని ముగించుకొని సంతోషంగా పాటలు పాడుకుంటూ ఇంటికి వచ్చింది.

అక్కడ తలుపు తాళం పగలగొట్టి ఉంది. వెంటనే ఆమె ఇంటిలోకి పరిగెత్తింది. అక్కడ నేలపై గుంతలు తవ్వి ఉంది. ఆమె హుండీ వైపు చూసింది. కాని ఎక్కడ హుండీ లేదు. కిందకు చూసింది. అది పగిలి ముక్కలు ముక్కలుగా ఉండటంతో చూసి, ఆమె బాగా ఏడ్చింది. అయ్యో కష్టపడి సంపాదించిన డబ్బు మొత్తం దొంగల పాలు అయ్యింది కదా! అనుకొని బాగా ఏడ్చింది. తరువాత ఆమె నిరాశపడకుండా ఎప్పటిలా పనికి వెళ్ళి, వచ్చిన డబ్బును హుండీలో దాస్తుండేది. అలా సంవత్సరం, రెండు సం॥లు అయ్యింది. ఆమె దగ్గర ఇప్పుడు దుకాణం పెట్టడానికి కావల్సినంతా డబ్బు ఉంది. ఆమె ఎంతో సంతోషంగా దుకాణం పెట్టింది. అప్పటి నుంచి ఎక్కువ లాభం పొందుతూ, ఎక్కువ డబ్బును సంపాదిస్తూ ఎంతో సంతోషంగా తన జీవనం కొనసాగిస్తూంది.

**నీతి :** కష్టపడితేనే సుఖపడతారు. ఎప్పుడూ మనం అనుకున్నది జరిగేదాకా పట్టు వదలకుండా ప్రయత్నిస్తేనే అది సాధ్యం అవుతుంది.

– ఎ. మౌనిక, బొదులబండ




# దొరకని ఎలుక

రైతు రాజయ్య ఇంట్లో ఎలుకలు ఎక్కువగా ఉన్నాయి. ఆ భావానందపురం ప్రజలందరికి తెలుసు. ఈ మధ్య రాజయ్య కొడుకు కొమురయ్య పుస్తకాలు, బ్యాగులను ఎలుకలు కొట్టాయని బడికే పోతలేడు. మా ఇంట్లో నుండి ఎలుకలను తరిమెయ్యాలని శ్రీనయ్య వాళ్ళ ఇంటి నుండి ఒక పిల్లి పిల్లను తెచ్చాడు.

పిల్లి ఉన్నది కదా ఎలుకల పని పిల్లికి, నీ పని చదువుకి అని అమ్మ అన్నది. అప్పటి నుంచి కొమురయ్య బడికి పోసాగాడు. రాజయ్య పిల్లికి పాలు పోసేవాడు.

ఒక రోజు ఒక ఎలుక, పిల్లిని చూడక అటు ఇటు తిరుగుతుంది. పిల్లి దానిని పట్టుకునేలోగా ఒక పైపులోకి పోయింది. పిల్లి పైపు దగ్గరే వుంది. కానీ తెలివైన ఎలుక ప్రాణ భయంతో ఇంకో వైపు నుంచి పారిపోయింది. ఇక ఈ ఇంటిలో ఉంటే ప్రాణము దక్కేలా లేదని అన్ని ఎలుకలను తీసుకుని అడవిలోకి పారిపోయింది.

- కొట్టాల అనూష, మర్యాక్

# సాయ గుణం

రంగాపురం అనే గ్రామంలో మానస, లాస్య అనే ఇద్దరు స్నేహితులు ఉండేవారు. వారిద్దరు ఇబ్రహీంనగర్ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నారు. మానస, లాస్య ఇద్దరు చదువులోనే కాదు, ఆటపాటల్లోను చురుకుగా ఉండేవారు. ఒకరి కోసం మరొకరు ప్రాణమిచ్చేటట్టుగా ఉండేవారు.

వాళ్ళ పాఠశాల వద్దకు రంగమ్మ అనే ఒక ముసలమ్మ తినుబండారాలు, జామకాయలు, తెచ్చి అమ్ముకుంటూ వచ్చిన డబ్బుతో జీవనం సాగిస్తుండేది. తనకు కొడుకు, కోడలు ఉన్నారు. కానీ వాళ్ళు పట్నంలో కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటారు. రంగమ్మ స్వతహాగా కష్టపడితే




వచ్చిన డబ్బులతోనే జీవనం సాగించేది. లాస్య, మానసలకు పాఠశాల సంక్రాంతి సెలవులు

ఇవ్వడంతో వాళ్ళ అమ్మా నాన్నలు వచ్చి, వారిని ఇంటికి తీసుకుని వెళ్ళారు. సంక్రాంతి పండుగ రోజు రంగు, రంగుల ముగ్గులు వేసి, గొబ్బెమ్మలను పెట్టారు. అమ్మ చేసిన రకరకాల పిండి వంటలను భుజించిన తర్వాత ఊళ్ళోని తమ మిగతా స్నేహితులతో కలసి, గాలి పటాలను ఎగరవేసారు. ఇద్దరూ సంక్రాంతి పండుగ సెలవులను ఎంతో ఆనందంగా గడిపారు.

సెలవుల అనంతరం పాఠశాల పునః ప్రారంభం రోజున లాస్య, మానస ఇద్దరూ కలిసి పాఠశాలకు వస్తున్న సమయంలో జామకాయలు అమ్ముకునే రంగమ్మ పాఠశాల ప్రహరీ గోడదగ్గర స్పృహతప్పి పడిఉంది. అది గమనించిన లాస్య, మానసలు ఆ ముసలమ్మ ముఖంపై, నీళ్ళు చల్లారు. అప్పుడు రంగమ్మ మెల్లిగా కళ్ళు తెరిచింది. కానీ లేచి కూర్చులేకపోయింది. లాస్య, మానసలు ఇద్దరూ రంగమ్మ చేతులను చెరో దిక్కు పట్టుకుని, పక్కనే ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్ళారు.

డాక్టరు శేఖర్ ముసలమ్మను పరీక్షించి, ఓ.ఆర్.యస్.యల్ ద్రావణాన్ని తాగించి, రంగమ్మ రెండు మూడు రోజుల నుండి ఏమీ తిననట్టుంది. అందుకే కళ్ళు తిరిగి పడిపోయిందన్నాడు. ముసలమ్మకు ఏమైనా తినిపించండి! అని చెప్పాడు. డాక్టర్ మాటలు విన్న లాస్య, మానసలు అలాగేననీ రంగమ్మను వాళ్ళ ఇంటికి తీసుకెళ్లారు.

లాస్య, మానసలు తాము ఇంటి దగ్గర నుండి తెచ్చుకున్న, టిఫిన్ డబ్బాలను తెరిచి, అమ్మ చేసిన చికెన్ బిర్యానీ రంగమ్మకు తినిపించారు. అంతే కాకుండా వాళ్ళు, తమవెంట తెచ్చుకున్న అమ్మ చేసిన కమ్మని పిండి వంటలు సకినాలు, గారెలు, కారప్పూస, గరిజలు, బూందిలడ్డులను కూడా కొన్నింటిని రంగమ్మకు ఇచ్చారు. రంగమ్మ ఎంత వద్దన్నా వారు ఊరుకోలేదు. ఏమీ కాదు నీకు రంగమ్మ. కాసేపు పడుకొని, విశ్రాంతి తీసుకోమ్మని చెప్పి, రంగమ్మ కొడుకు ఫోన్ నంబర్ తీసుకుని ఫోన్ చేసి రంగమ్మ ఆరోగ్యం కొంచెం బాగలేదని, రెండు రోజులు కుటుంబంతో వచ్చి, తనతో గడిపితే ఆమె త్వరగా మామూలు మనిషి అవుతుందని చెప్పారు. రంగమ్మ కొడుకు వచ్చే వరకు కనిపెట్టుకుని ఉండమని, ఇరుగుపొరుగు వారితో చెప్పారు.

"రంగమ్మ మేము పాఠశాలకు బయలు దేరతాము. జాగ్రత్తగా ఉండాలి" అని వాళ్ళు చెప్పగానే రంగమ్మ వాళ్లను దగ్గరకు తీసుకుని, "ఏ తల్లీ కన్నబిడ్డలో తల్లీ! మీరూ..! నాకూ ఇంత 'సహాయం' చేశారు. నేను పాఠశాల ముందు సొమ్మసిల్లి పడిపోతే, ఎంతో మంది పిల్లలు చూసి వెళ్ళి పోయారే కానీ, ఏ ఒక్కరూ మీలాగా నాకు 'సాయం' చేయలేదమ్మా! మీరు మంచి మనసున్న పిల్లలు, మీరు పది కాలాల పాటు చల్లగా ఉండాలి తల్లీ!" అంటూ దీవించింది. రంగమ్మ ఇంటి పక్కనున్న ఇరుగు పొరుగు వాళ్ళు కూడా లాస్య, మానసలు చేసిన సహాయాన్ని చూసి, ఎంతగానో అభినందించారు. లాస్య, మానసలు ఇద్దరూ సంతోషంతో అక్కడ నుండి పాఠశాలకు బయలుదేరి వెళ్లారు.

**నీతి :** ఓదార్చే మనసు కన్నా, సాయం చేసే గుణం మిన్న!

– యం. దీప,
జంగపల్లి, మిరుదొడ్డి

# కాలుష్యం

షణ్ముఖ ప్రియం పద్నాలుగేళ్ల అమ్మాయి. ఆమెకు నిన్నటి నుంచి వేసవి సెలవులు. ఈ రోజు తండ్రితో కలిసి ఉదయం ఆరు గంటల వేళ వాకింగ్ వచ్చింది. ఆమె తండ్రి ప్రతి రోజు ఉదయాన్నే ఇంటికి దగ్గరలో ఉన్న ఆ పార్కుకు వాకింగ్‌కి వస్తాడు. ఆ పార్కు చాలా బాగుంది. దాని మధ్యలో ఓ పెద్ద కొలను ఉంది. దానిలో కొన్ని బాతులు, మరికొన్ని ఏవో పక్షులు ఈదుతున్నాయి. ఆ కొలనుకు చుట్టూ రకరకాల చెట్లున్నాయి. వాటిలో కొన్ని ఆ కొలను వైపు వంగి, కొమ్మలతో నీళ్లను మీటుతున్నాయి. ఉదయించిన బాల సూర్యుని బంగారు కిరణాల్లో ఆ కొమ్మల ప్రతిబింబాలు ముదురు ఆకు పచ్చ రంగుతో ఎంతో అందంగా కనబడుతున్నాయి. నడక మార్గానికి రెండు వైపులా రకరకాల అందమైన పూల



మొక్కలు ఆహ్లాదకరంగా నవ్వులతో పలకరిస్తున్నాయి. వాటి మీద వాలుతూ, పక్కనున్న చెట్ల మీదకి ఎగురుతూ చిన్న చిన్న పక్షులు, పిట్టలు మనోహరంగా కూస్తున్నాయి. అవి పాటలు పాడుకుంటున్నాయి, ఆటలు ఆడు కుంటున్నాయి, పూలతో మాట్లాడు కుంటున్నాయి... చెట్ల మధ్యలో నుంచి తొంగి చూస్తున్న బాల సూర్యుడు బంగారు కాంతితో తళుకులీనుతున్నాడు. ప్రభాత వాయువులు నులివెచ్చగా, ఆహ్లాదకరంగా లోకాన్ని నిమురుతున్నాయి. అలాంటి అమృత ఘడియల్లో, అంత అందమైన చోట–అక్కడ చాలా మంది వాకింగ్ చేస్తున్నారు. వాళ్ల చెవుల్లో ఇయర్ ఫోన్స్, చేతుల్లో సెల్‌ఫోన్లు కనిపిస్తున్నాయి. కొందరి సెల్ఫోన్లో నుంచి పెద్ద సౌండ్‌తో ఏవో మ్యూజిక్‌లు, పాటలు, మాటలు వినిపిస్తున్నాయి. కొందరు సెల్ ఫోన్లలో తలదూర్చి, వాట్సాప్‌లో, ఫేస్బుక్లో, యూట్యూబ్లో... అలాంటివి మరేవో చూసుకుంటూ, వింటూ నడుస్తున్నారు. కొందరు ఎవరితోనో, ఏవో విషయాలు ఫోన్లలో గట్టిగా అరుస్తూ మాట్లాడుతున్నారు. వాళ్లందరూ సాంకేతిక వస్తువు లాగా కనబడుతున్నారు. యాంత్రికంగా వాకింగ్ చేస్తున్నారు. ఎవరికీ అక్కడి ప్రకృతితోను, పరిసరాలతోనూ, పరిస్థితులతోనూ సంబంధం ఉన్నట్టుగా, ఆ స్పృహ ఉన్నట్టుగా కనిపించడం లేదు. అక్కడ ఓ పక్కన ఉన్న జిమ్ పరికరాలతో కొందరు యాంత్రికంగా వ్యాయామం చేస్తున్నారు. వాళ్లు కూడా స్మార్ట్‌ఫోన్లతో, వేలాడుతున్న వైర్లతో, చెవుల్లో ఇయర్ ఫోన్లతో యంత్ర మానవుల్లాగానే కనబడుతున్నారు. ఆ పార్క్ నిండా అలా రకరకాల వయస్సులో ఉన్న ఆడా–మగా సగం యంత్రాలుగా రూపాంతరం చెందుతున్న వాళ్లు కనబడుతున్నారు.

"నాన్నా! ఇంత అద్భుతమైన ప్రకృతిలో, ఇంత పరిశుభ్రమైన సమయంలో – ఆరోగ్యం కోసం నడుస్తున్నప్పుడు; ఓ గంటసేపు సెల్ఫోన్లను వాడకపోతే, వెంట తెచ్చుకోకపోతే ఏమవుతుంది?" అని తండ్రిని అడిగింది షణ్ముఖ. "ఏమవుతుంది? ఏమీ కాదు! నేను తేలేదు కదా! ఈ రోజే కాదు వాకింగ్ చేస్తున్నప్పుడు ఎప్పుడూ నేను సెల్‌ఫోన్ తేను కదా. ఏమైంది? కొంపలేమి మునిగిపోలేదు," చిరు నవ్వుతూ అన్నాడు మధు. "వీళ్లంతా, చదువుకున్న వాళ్ళు కదా నాన్నా! పొల్యూషన్ గురించీ, సేవ్ నేచర్ గురించీ, తెలిసిన వాళ్లే కదా! మరెందుకు ఈ 'స్మార్ట్ పొల్యూషన్' గురించి పట్టించుకోరు? అంది షణ్ముఖ. "ఇది ఈనాటి మనుషుల నిర్లక్ష్య ధోరణి. నువ్వు స్మార్ట్ పొల్యూషన్ గురించి అడుగుతున్నావ్. ఇంత మంచి పార్కులో ఎక్కడబడితే అక్కడ–పారేసిన ప్లాస్టిక్ బాటిళ్లు, ప్లాస్టిక్ కవర్లు, ఇతర చెత్త గమనించావా? చెత్త కుండీలు ఉన్నా, ఎక్కడబడితే అక్కడే చెత్త పారేస్తారు. ప్లాస్టిక్ వాడొద్దని తెలిసినా ఇలా విచ్చలవిడిగా పరిసరాలను పాడు చేస్తారు. ఇది ఈనాటి మనుషుల నిర్లక్ష్యం బాధ్యతా రాహిత్య ధోరణి" అన్నాడు మధు.

"నిజమే నాన్నా! మాకైతే సేవ్ నేచర్ అనీ, ప్రకృతిని కాపాడమనీ, పరిశుభ్రత పాటించమనీ అందరూ ఎప్పుడూ చెప్పేవాళ్లే. కానీ, అది పెద్దవాళ్లు కూడా పాటించాలి కదా! ఇప్పుడు కొత్తగా ఈ 'స్మార్ట్ పొల్యూషన్' ను చిన్నా పెద్దా తేడా లేకుండా, విచ్చలవిడిగా పెంచి పోషిస్తున్నారు.

దీనితో కలిగే దుష్ఫలితాలు ఏమిటని తెలుసుకునే ప్రయత్నం చేయరు. తెలిసినా లక్ష్య పెట్టరు" నిరసనగా అంది షణ్ముఖ. "నిజమే తల్లీ! ఈ స్మార్ట్ ఫోన్ల వల్ల కలిగే కాలుష్యం, హాని నేరుగా వెంటనే కనిపించవు. కానీ కళ్ళ మీదా, చెవుల మీదా, ఆరోగ్యం మీదా, మనసు మీదా, వ్యక్తిత్వం మీదా దీని ప్రభావం సామాన్యమైంది కాదు. చిన్న పిల్లలకు కూడా విచ్చలవిడిగా స్మార్ట్ ఫోన్లు అందిస్తున్నారు. అవేవో ఆట వస్తువులన్నట్టు భావిస్తున్నారు. తాగుడు వ్యసనం కన్నా, మాదకద్రవ్యాల కన్నా హానికరమైన వ్యసనం ఇది. మామూలు వాతావరణ కాలుష్యం కన్నా ఈ కాలుష్యం తక్కువైంది కాదు" అన్నాడు మధు. కొలను ఎదురుగా ఓ చెట్టు కింద ఉన్న బెంచి మీద వాళ్లు కూర్చున్నారు. కొలనులో బాతులు సరదాగా జలకాలాడుతున్నాయి. ఆ బాతుల వైపే చూస్తూ, తండ్రితో ఇలా మాట్లాడింది షణ్ముఖ. "ఇక్కడే కాదు నాన్నా! మొన్న నేను మమ్మీతో మెట్రోలో వెళుతుంటే చూశాను; అక్కడా దాదాపు అందరూ ఇలాగే ఉన్నారు. ఫోన్లు తప్ప మరేమీ పట్టించుకోని పరిస్థితి. రోడ్ల మీద అయినా, సినిమా థియేటర్లో నైనా, ఎక్కడైనా ఎప్పుడైనా దాదాపు ఎనభై శాతం మంది ఇలాగే ఉంటున్నారు నాన్నా!" "అవును. ఇళ్లల్లో, ఆఫీసుల్లో కూడా ఇదే పరిస్థితి" అన్నాడాయన. "మొన్న మా స్కూల్లో సైన్స్ సార్ చెప్పారు– పరిశీలించడం, ఆలోచించడం, ఊహించడం, విశ్లేషించడం మనిషికి ఉండే ప్రత్యేకతలని. సాహిత్యానికైనా, సైన్స్ కైనా అవే మూల సూత్రాలని. వాటికి అద్భుతమైన కల్పనా శక్తి జోడిస్తే గొప్ప సాహిత్యం వస్తుందని, పరిశోధన తోడైతే శాస్త్రీయ ఆవిష్కరణలు జరుగుతాయని చెప్పారు. కానీ, తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని చూడని, పరిశీలించని, ఆలోచించని, ఊహించని మనుషులతో మంచి సాహిత్యం కానీ, శాస్త్రీయ ఆవిష్కరణలు కానీ ఎలా జరుగుతాయి నాన్నా!" "నిజమేనమ్మా! మీ మాస్టారు చెప్పింది నిజమే! మెదడును ఏ మాత్రం ఉపయోగించని మనుషులు, చుట్టూ ప్రపంచంతో సజీవ సంబంధం పెట్టుకోని జాతి, నిర్వీర్యమైపోయి, యాంత్రికమై పోయి మానవ స్వభావాన్ని కోల్పోతుంది!" ఆ సమయంలో షణ్ముఖ ప్రియకు గ్రేటా థున్బెర్గ్ గుర్తుకు వచ్చింది. ఆ రాత్రి ఓ రెండు పెద్ద డ్రాయింగ్ షీట్లు, స్కెచ్ పెన్నులు తీసుకుని స్మార్ట్‌ఫోన్ కాలుష్యం గురించి కొన్ని విషయాలు పెద్ద పెద్ద అక్షరాల్లో అందంగా రాసింది. చిన్నపిల్లల భవిష్యత్తు కోసమైనా దీన్ని గురించి పెద్దవాళ్లు ఆలోచించాలని ప్రార్థించింది. తన పేరు, వయస్సు, తరగతి మొదలైన వివరాలు రాసింది. మరుసటి రోజు తండ్రితో వచ్చి, ఆ పార్కులో గేటు దగ్గర ఉన్న నోటీస్ బోర్డ్ మీద, దాన్ని చక్కగా అతికించింది. తిరిగి వెళ్లేటప్పుడు చూస్తే అక్కడ కొందరు పెద్దవాళ్లు నిలబడి దాన్ని శ్రద్ధగా చదువుతున్నారు. "వాళ్లలో ఏ ఒక్కరైనా మారితే మంచిదే కదా!" అని తండ్రితో అంది షణ్ముఖ ప్రియ. తరువాత కొద్ది రోజులకే జరిగిన ఆ కాలనీ సమావేశంలో షణ్ముఖ ప్రియను ప్రత్యేకంగా పిలిపించి, ఆ విషయం మీద మాట్లాడించారు.

–డా. వి.ఆర్. శర్మ,
ఫోన్ : 9177887749

# అరిసె దెబ్బ

రాజు, రాము ప్రాణ స్నేహితులు. ఒక రోజు ఇద్దరూ పాఠశాలకు వెళ్తున్నారు. ఆ రోజు చాలా ఎండగా ఉంది. ఆ ఎండ తీవ్రతకు రాజుకు కొంత అస్వస్థత అయింది. అతడు పాఠశాలకు వెళ్ళలేక పోయాడు. రాము రాజుని తీసుకుని మళ్ళీ ఇంటికి వెళ్లిపోయారు. డాక్టర్ దగ్గరకు తీసుకువెళితే వడదెబ్బ తగిలిందని పాఠశాలకు వెళ్ళొద్దని, విశ్రాంతి తీసుకోమని చెప్పారు. రాజుని బయటికి పంపకుండా వాళ్ళ అమ్మ కాపలాగా కూచుండిపోయింది. కానీ రాజు లేకుండా రాముకి పాఠశాలకు వెళ్లాలనిపించలేదు. రాము రాజు లేకుండా పాఠశాలకు వెళ్లలేక ఇంటికి తిరిగి వెళ్ళలేక రోజంతా బయటే స్నేహితులతో ఆడుకోవడం మొదలుపెట్టాడు. రోజంతా ఆటలతో గడిపేసి సాయంత్రానికి ఇల్లు చేరుకున్నాడు. తల్లిదండ్రులు రాము స్కూలుకి వెళ్లి వచ్చాడని అనుకున్నారు.



తెల్లవారి పాఠశాలకు వెళ్లిన రాము, రాజులను ఉపాధ్యాయులు పాఠశాలకు ఎందుకు రాలేదని అడిగారు.. అప్పుడు రాజు తనకు వడదెబ్బ తగిలిందని చెప్పాడు. మరి నువ్వెందుకు రాలేదని అడిగితే ఏమి చెప్పాలో తెలీక మౌనంగా ఉండి పోయాడు... అప్పుడు ఉపాధ్యాయుడు చెంపపై అరచేతి గుర్తు పడేలా ఒక్కదెబ్బ వేసాడు.. దానికి రాజు "సార్.. దారిలో అస్వస్తుడనైన నన్ను రాము ఇంటికి తీసుకువెళ్ళాడు. తనని కొట్టకండీ" అన్నాడు.. అదేంటి ముందే నువ్వు చెప్పొచ్చుగా అని ఉపాధ్యాయులు అడగగా దానికి రాము "అవునండి ఎండకు దెబ్బ తగిలితే వడదెబ్బ అన్నారు కదా నేను ఆడుకోవడానికి వెళ్ళి అరచేయి దెబ్బ తగిలించుకుని అరిసాను. అందుకే ఇది అరిసెదెబ్బ.. నాకు అరిసెదెబ్బ తగిలింది" అన్నాడు... తరగతి గది అంతా నవ్వులతో నిండిపోయింది. ఉపాధ్యాయుడు కూడా అతని తెలివికి మరియు స్నేహితుడి ఆరోగ్యం పట్ల తీసుకున్న శ్రద్ధకి అభినందించారు.

– రమాదేవి బాలబోయిన

# మాట వినాలి

అనగనగా ఒక అడవి ఉండేది. ఆ అడవిలో ఒక చెట్టుపైన కాకి, పాలపిట్ట, రామచిలుక కలిసిమెలిసి ఉండేవి. ఒక రోజు రామచిలుక ఆహారం కోసం బయటికి వెళ్ళింది. అక్కడ దానికి పెద్ద మంటలు కనిపించాయి. ఇది చూసిన రామచిలుక అడవి కాలిపోతుందని తన స్నేహితులకు చెప్పింది. మనం ఇక్కడి నుండి దూరంగా వెళ్ళిపోదామని రామచిలుక అంది. కాని కాకి, పాలపిట్ట ఈ విషయం నమ్మలేదు. అంతలోనే మంటలు తమ చెట్టును చుట్టుముట్టాయి. వెంటనే ముగ్గురు స్నేహితులు కలిసి మంటలకు దూరంగా వెళ్ళాయి. కాకి, పాలపిట్ట తన స్నేహితురాలు చెప్పిన మాటలు ముందుగానే విననందుకు రామచిలుక ముందు తలదించుకున్నాయి. ఇకముందు ఎన్నడూ స్నేహితుల మాటలు పెడచెవిన పెట్టకుండా కలిసి మెలిసి ఉన్నాయి.




**నీతి:** మన మేలు కోరే స్నేహితుల మాటలను పెడచెవిన పెట్టరాదు.

– ఎ. అలేఖ్య,
చందాపూర్, మం: తోగుట.

# పరివర్తన

గణ గణ మని బడి గంట మ్రోగింది. విద్యార్థులందరు గబా గబా తరగతి గది నుండి బయటకు వస్తున్నారు. ఎనిమిదవ తరగతి చదివే రోహన్, చరణ్ ఇద్దరు కలిసి గేటు బయటికి వచ్చారు. ఇంతలో రోహన్ తమ్ముడు అర్జున్ కూడా పరిగెత్తుకుంటూ వచ్చాడు. ముగ్గురు కలిసి ముచ్చట్లతోనే దారిలో చెరువు గట్టు మీద నుండి ఆటపాటలతో ఇంటిదారి పట్టారు.

చరణ్ ఈ మధ్యనే కొత్తగా పాఠశాలలో చేరాడు. అతడు తన ఇంటికి వెళ్లే దారిలోనే రోహన్ ఇల్లు వస్తుంది. అలా ఇద్దరు పరిచయమయ్యారు. ఒకరోజు చరణ్ బడికి వెళ్తూ దారిలో ఉన్న రోహన్ వాళ్ళింటికి వెళ్ళగానే రోహన్ పాఠశాలకు తయారవుతున్నాడు. వాళ్ళ నాన్నగారు చరణ్‌ను చూసి 'నీ పేరేమిటి? ఎక్కడ వుంటారు? మీనాన్నగారి పేరేమిటి? మీ నాన్నగారు ఏమి చేస్తార'ని పలకరించారు. 'నా పేరు చరణ్ అంకుల్. మా నాన్న గారి పేరు క్రిష్ణారావు, బాంకులో క్లర్క్‌గా చేస్తున్నారంకుల్' అని అన్నాడు. 'ఓహెూ మా బ్యాంకులో చేసే క్రిష్టారావు గారి కొడుకువా. తండ్రికి తగిన కొడుకులా వున్నావని, అంటు లోపలి రూంలోకి వెళ్ళాడు. అక్కడే కూర్చున్న రోహన్ నానమ్మ కూడా చరణ్‌తో మాట్లాడుతూ, పిల్లవాడికి ఎంత వినయం, విధేయత అంటూ వాడిని మెచ్చుకోవడమే గాకుండా, 'రోజూ ఇంటికి వచ్చి అందరు కలిసి వెళ్ళండి' అంది. రోహన్ అర్జున్ తయారు కాగానే ముగ్గురు కలిసి బడికి వెళ్ళారు.

చరణ్ చురుకైన విద్యార్థి ఉపాధ్యాయులందరి చేత మెప్పు పొందుతున్నాడు. ఆ రోజు సోషల్ సార్ నోట్స్ దిద్దడానికి అందరిని నోట్స్ పెట్టమన్నారు.



నోట్స్‌దిద్దుతూ, చరణ్ నోట్ బుక్ రాగానే అందరికీ చూపించి చరణ్ చాలా చక్కగా రాసాడు. ఇలా చక్కగా గుండ్రని రాతను రాయడానికి ప్రయత్నం చేయాల'ని చెప్పారు.

అసలే ఉదయం నాన్న, నానమ్మ చరణ్‌ని మెచ్చుకోవడం విని భరించలేక పోయిన రోహన్, సార్ మాటలను సహించలేకపోయాడు.

వాడికి ఈ రోజు మనసులో ఏదో తెలియని బాధ కలుగుతోంది. ఎప్పుడు తనను మెచ్చుకునే వారంతా

చరణ్‌ను మెచ్చుకోవటం తట్టుకోలేకపోతున్నాడు. వాడిలో తెలియకుండానే అసూయ మొదలైంది. ఎలాగైనా చరణ్‌ను అందరి చేత తిట్టించాలి అని అనుకున్నాడు. అనుకోగానే వాడికి ఒక ఆలోచన వచ్చింది ఇంతలో ఇంటర్వెల్ అయింది. అందరు తరగతి గది నుండి బయటకు వెళ్ళారు. అదే అవకాశం అనుకుని ఎవరు లేని సమయంలో తన దగ్గర వున్న నోట్స్ కోసమని నాన్నను అడిగి తీసికున్న వంద రూపాయలను చరణ్ బ్యాగ్‌లో పెట్టాడు. వెనుదిరిగే సరికి రోహన్ తమ్ముడు అర్జున్ ప్రక్కనే నిల్చుని కనిపించేసరికి ఆశ్చర్యపోయాడు. "ఏంటి అన్నయ్యా, అలా చరణ్ బ్యాగులో డబ్బులు పెడుతున్నావేంటి?" అంటూ అడిగాడు. "అర్జున్ నువు నోర్మూసుకో, ఈ విషయం నీవు ఎవరికి చెప్పొద్దు, పద పద" అంటూ అర్జున్‌ని తీసుకొని గది నుండి బయటకు వచ్చాడు. ఇంటర్వెల్ అయిపోగానే, "అయ్యో, నా వంద రూపాయలు పోయాయి. ఉదయం నుండి నా బ్యాగులోనే వున్నాయి. నోట్స్ కొనాలని నాన్న నడిగి తెచ్చుకున్నాను. ఇప్పుడెలా ఈ విషయం నాన్నకు తెలిస్తే కొడతాడు" అంటూ ఏడవడం మొదలు పెట్టాడు. ఈలోగా తరగతికి సార్ వస్తూనే, 'ఏంటి క్లాసంతా అల్లరిగా ఉంది. ఏమైంది' అని అడిగారు. 'సార్, రోహన్ వందరూపాయలు పోయాయట సార్, అందుకు ఏడుస్తున్నాడు. అన్నారు పిల్లలు. ఎప్పుడు పోయింది? అని సార్ అడగగానే, ఉదయం నుండి నా దగ్గరే వున్నాయి సార్. ఇప్పుడు చూస్తే కనిపించడం లేదుసార్, అని ఏడుపు నటించాడు. సరే, సరే అందరి బ్యాగులను ఒకసారి చెక్ చేయి అన్నాడు సార్. అందరి బ్యాగులను చూసి, చరణ్ బ్యాగును చెక్ చేస్తే అందులో వంద రూపాయలు దొరికినయని బయటకు తీసాడు. చరణ్ బ్యాగ్‌లో వున్నాయా సార్ ఆశ్చర్యపోతూ చరణ్‌ని పిలిచి, 'నీవు మంచి పిల్లవాడివని అనుకున్నాను. మంచిగా చదివితే కాదు, బుద్ధి కూడా మంచిగా వుండాల'ంటూ మందలించారు సార్. 'నేను తీసుకోలేదు సార్, నా బ్యాగ్‌లోకి ఎలా వచ్చాయో నాకసలు తెలియదు' అంటూ వెక్కి వెక్కి ఏడ్చాడు చరణ్. రోహన్ లోలోపల సంతోష పడుతూనే, 'ఎందుకురా చరణ్ అలా తీసుకున్నావు? నీకు అవసరమైతే, నన్ను అడిగితే ఇచ్చేవాడిని కదా అని అనేసరికి చరణ్‌కి పుండు మీద కారం చల్లినట్లు బాధ కలిగినది. ఆ డబ్బులు తన బ్యాగ్‌లోకి ఎలా వచ్చాయి. తాను తీసుకోలేదు కదా తన బ్యాగ్‌లో దొరికే సరికి అందరు తనను దోషిలా చూసేసరికి, కళ్ళ నిండా నీళ్ళు గిర్రున తిరిగాయి. ఏడ్పును ఆపుకోలేక పోయాడు. ఏడ్చి ఏడ్చి కళ్లు ఉబ్బినవి.

ఇంటికి వెళ్ళగానే చరణ్‌ని చూసి వాళ్ళమ్మ, 'ఏమైంది అలా వున్నావేంటి' అంటూ అడిగేసరికి వాడికి దుఃఖం ఆగలేదు. బాగా ఏడ్చాడు. వాళ్ళమ్మ దగ్గరకు తీసుకుని ఓదార్చింది. తరువాత జరిగినదంతా వాళ్ళమ్మకు చెప్పాడు. 'ఎవరో కావాలని చేసి వుంటారు. నీవెందుకు బాధపడుతున్నావు. నేను రేపు బడికి వస్తాను. విషయం కనుక్కుంటాను' అంది వాళ్ళమ్మ పావని. 'రోహన్‌కు పోయినవి అనుకున్న డబ్బులు దొరికినవి. వాడు ఏడిస్తే నాకు చాలా బాధ అయ్యింది. కాని అవి నా బ్యాగ్‌లో దొరికినవి. కాని ఎవరు పెట్టారో ఏమో నాకు తెలియదమ్మా, నీవు వచ్చి అడిగితే పెద్ద గొడవ అవుతుందమ్మా అని అంటుండగానే, పక్కింటి నందిని వచ్చి 'ఏంటి చరణ్ ఎవరివో డబ్బులు తీసావని గొడవ అయ్యిందట కదా! మా గోపీ చెప్పాడు' అంది. అపుడు పావని 'మావాడు అలాంటి వాడు కాదు నందినీ, ఎలా జరిగిందో ఏమో, అది తలచుకునే బాధపడుతున్నాడు'. అనగానే, 'ఏమో వదినా నాకేం తెలుసు పిల్లలనుకుంటుంటే విన్నాను అంతే' అనుకుంటూ, ఆక్కడి నుండి వెళ్ళిపోయింది.

రోహన్‌కి లోలోపల చాలా సంతోషంగా వుంది. 'వీడు నన్నే డామినేట్ చేస్తాడా, వీడికి మంచి పనైంద'ని అనుకున్నాడు. చురుకుగా సమాధానాలు చెప్పే చరణ్

ఈ మధ్య ముభావంగా వుంటున్నాడు. ఎప్పుడు మంచి మార్కులు తెచ్చుకునేవాడు. ఈ సారి మార్కులు కూడా తగ్గినవి. ప్రోగ్రెస్ కార్డ్ చూసిన తల్లిదండ్రులు ఎందుకు మార్కులు తక్కువగా వచ్చాయని అడిగారు. చరణ్ ఏమీ చెప్పలేకపోయాడు.

వాళ్ళు, 'ఎందుకు డల్‌గా వుంటున్నావు. ఉత్సాహంగా వుండాలి. మంచిగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవా'లని నెమ్మదిగా చెప్పి, అనేక విధాలుగా వాడికి ప్రోత్సాహాన్నందించారు.

పంద్రాగస్టు సందర్భంగా జరిగిన ఆటల పోటీలలో వ్యాస రచన, ఉపన్యాస పోటీలలో చాలా ప్రైజులు చరణ్ గెలుచుకున్నాడు. రోహన్‌కి ఒక్క కబడ్డీలోనే ప్రైజ్ వచ్చింది. వేదికపై నుండి పదే పదే చరణ్‌ని పిలవటం, అంతేగాకుండా బహుమతి ప్రదానోత్సవం చివరలో పి.ఇటి సార్ చరణ్‌ని పిలిచి ఇది ప్రత్యేక బహుమతి, మన పాఠశాలలో మొక్కలు నాటి, తీరిక సమయంలో వాటికి నీరు పోసి ఒక గార్డెన్‌లా తయారు చేసిన చరణ్‌కి చప్పట్లు కొట్టండి. అని అన్నాడు. అదంతా చూసేసరికి రోహన్‌కి అహం దెబ్బతిన్నట్లైనది.

మరుసటి రోజు పాఠశాలలో మొక్కలు చూసే సరికి వాడికి ఒళ్ళు మండిపోయింది. తరగతులు జరుగుతుండగా మధ్యలో బయటికి వచ్చి ఒక కట్టె తీసుకుని చెట్లనుబాదుతూ, చిన్న మొక్కలను పీకడానికి ప్రయత్నం చేస్తున్నాడు. పై నుండి సార్ చూసి గబగబా కిందికి దిగి వచ్చి 'ఏరా ఎందుకు అలా చేస్తున్నావు నిన్ననే కదా చెట్లను పెంచాలి అని చెప్పింది. నీవు చెట్లను పెట్టక పోగా, వాటిని పాడు చేస్తున్నావు. మొన్నీ మధ్యనే నీ వంద రూపాయలు పోయినవని చరణ్ బ్యాగ్‌లో దొరికినవని అన్నావు. ఇప్పుడు చెట్లను నాశనం చేస్తున్నావు. ఇదంతా నీవు కావాలని చేసినపనే. నీకు చరణ్ అంటే అసూయ పెరిగింది. అలా ఉండకూడదు. ఇంకొక సారి ఇలా చేసావంటే మీ తల్లిదండ్రులకు చెప్పాల్సి వస్తుందంటూ మందలించారు.

బడి గంట కాగానే చరణ్‌తో కలిసి వెళ్ళకుండా రోహన్ వెళ్ళిపోతున్నాడు. 'ఆగు రోహన్, నేను కూడా వస్తున్నాను'. అంటూ గబగబా రోహన్‌తో కలిసి వెళుతున్నాడు చరణ్. 'ఛీ, వీడు వచ్చినప్పటి నుండి నాకు కష్టం వచ్చింది. వీడిని చూస్తేనే కోపం వస్తోంది. ఈ చెరువు గట్టుమీది నుండి పడేస్తే వీడి పీడ విరగడ అవుతుందని పిస్తుంది'. అని మనసులో అనుకుంటున్నాడు. ఇంతలో వెనుక నుండి అర్జున్ పరిగెత్తుకుంటూ వస్తూ కాలు రాయికి తట్టుకొని ఎగిరి కింద పడ్డాడు. దొర్లుకుంటూ చెరువులో పడిపోయాడు. ఒక్కసారి అరుపులు విని అనుకోని పరిణామానికి రోహన్ భయపడిపోయాడు. అర్జున్‌కి ఈతరాదు, తనకు ఈతరాదు, ఏమి చేయాలో తోచడం లేదు. వాడు పైకి రాలేక నీళ్ళలో ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు.

విషయం అర్ధమైన చరణ్ ఒక్క ఉదుటన చెరువులోకి దూకి, ఈత కొడుతూ వెళ్ళి అర్జున్‌ని పట్టుకుని బయటకు తీసే ప్రయత్నం చేస్తూ, విఫలమవుతూ మళ్ళీ పట్టువదలని విక్రమార్కునిలా అర్జున్‌ని పట్టుకుని గట్టుకు చేర్చాడు. ఇంతలో దారిలో బైక్ మీద వెడుతున్న ఇద్దరు యువకులు వచ్చి అర్జున్‌ని పడుకోబెట్టి, మింగిన నీళ్ళను బయటకు వచ్చేలా చేసారు. వాళ్ళింటి అడ్రస్ అడిగి తెలుసుకుని వాళ్ళింటికి తీసికెళతామన్నారు. సరేనన్నాడు రోహన్.

రోహన్‌ని దగ్గరకు తీసుకుని, 'మంచితనం ఎప్పటికైనా నిలిచి వుంటుందిరా. చెడుదారిలో వెళితే జీవితమే అంధకారమవుతుంది. అంత మంచి స్నేహితుడు వుండటం నీ అదృష్టమే, మనసులో కోపాన్ని ఎప్పుడూ పెట్టుకోవద్దు. అది చివరకు మనల్నే దహించి వేస్తుంది' అంది అమ్మ.

**– పులి జమున**



# అపురూప కానుక

అనగనగా ఒక ఊరిలో రమేష్, రంగమ్మ అనే వారు ఉన్నారు. రంగమ్మకు కొడుకు, కోడలు లేరు. ఎప్పుడూ ఆమె రొట్టెలు చేస్తుండేది. వారు డబ్బులు లేని వారు. వాళ్ళ మనవడు రమేష్ మా అమ్మా నాన్న ఎక్కడికి వెళ్లారు, ఎక్కడున్నారు అని అడిగాడు. వాళ్ళ నానమ్మ వారు చనిపోయారు అని చెప్పలేక... మీ అమ్మా నాన్న నీ కోసం బొమ్మలు, డబ్బులు తీసుకు రావడానికి విదేశాలకు వెళ్లారు అని చెప్పింది. రమేష్ వాళ్ళ అమ్మా నాన్న అవన్నీ తీసుకుని వస్తారని ఆశతో ఉన్నాడు.

కొన్ని రోజుల తర్వాత దసరా పండుగ వచ్చింది. వాళ్ల ఊరిలో అందరూ కొత్త బట్టలతో అలంకరించుకున్నారు. రమేష్ నాకు కూడా కొత్త బట్టలు కావాలని అడిగాడు. వాల్ల నానమ్మ నా దగ్గర డబ్బులు లేవు అంది. మనకు కొత్త బట్టలు కట్టుకునేంత స్థోమత లేదు. కాని నేను చేసిన రొట్టెలకు మూడు రూపాయలు వచ్చాయి. ఇవి తీసుకొని వెళ్లి నీకు ఇష్టమైనది కొనుక్కో అంది. రమేష్ వాళ్ళ నానమ్మతో... అక్కడ ఎంతో మంది ఉంటారు కదా! మనము వాళ్లతో కలిసి వెళ్లి తెచ్చుకుందాం అన్నాడు. అప్పుడు వాళ్ళ నానమ్మ "నేను నీతో వస్తే రొట్టెలు చేసే వారు ఉండరు కదా! అందుకే నేను రాలేను. నువ్వు జాగ్రత్తగా వెళ్లి నీకు ఇష్టం వచ్చింది కొనుక్కో" అంది.

రమేష్ గుడికి వెళ్లి దర్శనం అయిపోయిన తర్వాత

దుకాణం దగ్గరికి వెళ్లి అన్నింటిని చూశాడు. కానీ తను తెచ్చినవి మూడు రూపాయలు, వాటితో ఎట్లాంటి బొమ్మలు రావు అనుకొని.. ఒక ఇనుప సామాను చేసేవారి దగ్గర ఆగాడు. వాళ్ళు చేస్తున్న పని చూశాడు. మా నానమ్మ రోజు రొట్టెలు చేసి చేతులు కాల్చు కుంటుంది. ఈ పట్టుకారు కొని నానమ్మకు ఇస్తే ఎంతో సంతోషపడుతుంది అనుకున్నాడు.

వెంటనే తన దగ్గర ఉన్న మూడు రూపాయలు తీసి దుకాణదారుడికి ఇచ్చాడు. ఆ పట్టుకారుకి నాలుగు రూపాయలు అని దుకాణదారుడు అన్నాడు. రమేష్ వాళ్ళ నానమ్మ గురించి చెప్పిన తర్వాత అతను సరే అని మూడు రూపాయలకే ఇచ్చేశాడు. రమేష్ ఎంతో సంతోషంగా వాళ్ళ నానమ్మ దగ్గరికి వెళ్ళాడు.

రమేష్ వాళ్ళ నానమ్మ ఏం కొనుక్కొని వచ్చావు అని అడుగుతుంది. ఇదిగో నానమ్మ నీ కోసం ఇది తీసుకొని వచ్చాను అని పట్టుకారు చూపిస్తాడు. రమేష్ వాళ్ళ నానమ్మ ఎంతో సంతోషపడింది. చిన్నవయసులో రమేష్ తెలివితేటలకు అబ్బుర పడిపోయింది.

– కె.జ్యోతి,
చింతగట్టు

# పరిసరాల పరిశుభ్రత

అనగనగా ఒక ఊరు. ఆ ఊరి పేరు రామాపూర్. చూడటానికి ఎంతో అందవికారంగా, అపరిశుభ్రంగా ఉంటుందా ఊరు. అక్కడి ప్రజలు ఎప్పటికి ఏదో ఒక జబ్బుతో బాధపడుతూ ఉంటారు. వారి పిల్లలను పక్క ఊరుకు చదువుకోవడానికి పంపించేవారు. వారు అపరిశుభ్రంగా ఉంటూ, నిత్యం ఏదో ఒక వ్యాధితో బాధపడుతూ బడికి వెళ్లేవారు .దీంతో వారి నుంచి పక్కఊరి పిల్లలకు, చివరికి ఉపాధ్యాయులకు వారి వ్యాధులు అంటుకునేవి.


ఇదంతా గమనించిన కొత్తగా వచ్చిన హెడ్ మాస్టర్ సూర్యం, పిల్లలతో మాట్లాడి రామాపూర్ పరిస్థితి తెలుసుకున్నారు. రామాపూర్ లో ఉన్న పరిస్థితిని పై అధికారులకు వివరించి, వెంటనే మార్పు చేయకపోతే చుట్టూ ఉన్న గ్రామాలకు దాని ప్రభావం పడుతుందని చెప్పారు. అయితే అధికారులు సరిగా స్పందించక పోగా.. సూర్యం సార్‌ను హేళన చేశారు. చివరికి సూర్యం పట్టువదలకుండా ఆ ప్రాంత ఎం.ఎల్.ఎకు పరిస్థితిని వివరించారు. దీంతో ఆయన అధికారులకు



చివాట్లు పెట్టారు. దీంతో అధికారులు, సూర్యం సార్ కలిసి ప్రజల్లో పచ్చదనం పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు వారివంతు సాయం చేశారు. దీంతో క్రమంగా ఆ ఊరిలో మార్పులు జరిగి.. కొంతకాలానికే ఊరు స్వచ్ఛమైన గ్రామంగా మారిపోయింది. అక్కడి ప్రజలు ఎలాంటి జబ్బులు లేకుండా ఆరోగ్యంగా సంతోషంగా ఉన్నారు.

– ఎ.హెప్సిబ, తాడికల్

# చెలిమి - కలిమి



పూర్వం ఒక అడవిలో ఒక పొగరుబోతు మేకపోతు ఉండేది. అది ఎవర్నీ లెక్క చేయకుండా పొగరుగా వ్యవహరించేది.

ఒక రోజున ఒక పెద్ద ఏనుగు దాని కళ్ళబడింది. "ఏయ్ ఏనుగూ... ఏ ప్రదేశం నీది? ఇక్కడకి ఎందుకు వచ్చావు?" అంది పొగరుగా.

"మా ప్రదేశంలో ఆహారం అయిపోయింది. అందుకే ఇక్కడికి వచ్చాను," అంది ఏనుగు వినయంగా.

"అయిపోతే వచ్చేయటమేనా? ఇక్కడ ఏ ఆహారం ముట్టుకున్నా నేను ఊరుకోను. ఈ ప్రదేశం మాది," అంది మేకపోతు ఇంకా పొగరుగా.

ఏనుగులో సహనం చచ్చిపోయింది. దానికి ఒళ్ళు మండిపోయింది. ఇంత చిన్న జంతువు నన్ను లెక్క చేయకుండా ఇంతింత

మాటలు అనటమా అని మనసులో అనుకొని దానిని తొండంతో చుట్టి గిరగిరా త్రిప్పి దూరంగా విసిరివేసింది.

మేకపోతు ఒక పెద్ద ఏరు దాటి అవతల పడింది. అక్కడ ఏ మాత్రం పచ్చదనం లేక అంతా ఇసుకమయంగా వుంది. మేకపోతు కుయ్యో మొర్రోమంటూ లేచి పొగరుగా వ్యవహరించి నందుకు ఎంత పని జరిగిందిరా దేవుడా అని మనస్సులో అనుకుంటూ ఆ ప్రదేశంలోనే తిరగసాగింది.

కొన్ని రోజులు గడిచాయి.

ఇక్కడ ఏనుగు హాయిగా దొరికిన ఆహారమంతా తింటూ సుఖంగా వుండసాగింది.

అక్కడ మేకపోతుకి ఆహారమే దొరక్క చిక్కి శల్యమై చావుకి సిద్ధమైంది.

ఒక రోజున ఏనుగు బాగా ఆహారం తిని, నీళ్ళు తాగుదామని ఏరు దగ్గరికి వెళ్ళింది. ఏటికి అవతల ప్రక్క చిక్కిపోయిన మేకపోతు కనిపించింది. అది ఎవరో గుర్తు పట్టక "ఓ మేకపోతూ, ఆహారమే దొరకని ప్రదేశంలో ఎందుకున్నావు? అక్కడ వుంటే ఎలా బ్రతుకుతావు?" అని ప్రేమతో ప్రశ్నించింది.

దానికి మేకపోతు "ఏనుగు గారూ, నన్ను గుర్తుపట్ట లేదా? ఆ రోజున మిమ్మల్ని పొగరు బోతుతనంతో అవమానించానే – ఆ మేకపోతునే నేను. మీరు నన్ను ఆ రోజున విసిరికొడితే ఇక్కడికి వచ్చి పడ్డాను. ఇక్కడ ఆహారమే లేదు. పస్తుల్తో చచ్చి పోతున్నాను. నా పొగరు అణిగింది. దయచేసి నన్ను కాపాడండి," అంది కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ.

మేకపోతు పరిస్థితి చూసేసరికి ఏనుగుకి చాలా బాధ కలిగింది. అది ఏటిలోకి దిగి అవతలికి వెళ్ళి "మీరు నా మీదకి ఎక్కి కూర్చోండి. అవతల దింపుతాను," అంది.

మేకపోతు ఏనుగు మీదకు ఎక్కింది.


ఏనుగు లేచి మళ్ళీ ఏటిలోకి దిగి నీటిలో నడుచుకుంటూ ఇవతలకి వచ్చి మళ్ళీ కూర్చుని "ఇక దిగండి," అంది.

మేకపోతు క్రిందకు దిగింది. కాని బాగా ఆకలిగా వున్న మేకపోతుకి క్రింద వున్న ఆహారం సరిపోయేటట్లుగా లేదు. "ఏనుగు గారూ నాకు బాగా ఆకలిగా వుంది క్రింద ఆహారమే లేదు. దయచేసి నన్ను మళ్ళీ మీ వీపు మీద ఎక్కించుకొండి. నేను మీ మీద నిల్చొని పెద్ద పెద్ద చెట్ల ఆకులు అందుకొని తింటాను," అంది.

ఏనుగు సరేనని మళ్ళీ మేకపోతును తన వీపు మీద ఎక్కించుకొన్నది. చిన్నగా నడుస్తుంటే – పైన మేకపోతు హాయిగా కూర్చుని దొరికిన ఆహారమంతా కమ్మగా తింటూ "ఇదివరకు పొగరు బోతుతనంతో వ్యవహరిస్తూ అందరితో శత్రుత్వం తెచ్చుకోవడం వల్ల ఎంతో నష్టపోయాను. ఇప్పుడు మంచితనంతో వ్యవహరిస్తూ మిత్రుడ్ని సంపాదించుకోవడం వలన ఎంతో లాభపడ్డాను. పొగరుగా వ్యవహరిస్తూ శత్రువుల్ని పోగు చేసుకోవడం వలన నష్టమే కాని లాభం లేదు. మంచిగా వ్యవహరిస్తూ మిత్రుల్ని పోగు చేసుకోవడం వలన లాభమే కాని నష్టం లేదు" అనుకుంది.

–బొమ్మరిల్లు

# భూమి-విజ్ఞానం



ఓ అడవిలో తండ్రీ కొడుకులు పోడు వ్యవసాయం చేస్తూ జీవిస్తుండేవారు. ఓనాడు తండ్రిని పాము కరిచింది. ఏదో చెట్ల పసరులు పోశాడు. కానీ ఫలితం కనిపించలేదు. చనిపోతానని తెలుసుకుని "ఒంటరిగా వుంటే భాష కూడా మర్చిపోయే ప్రమాదముంది కనుక నువ్వు భూమితో మాట్లాడుతుండు. అది నీకు విజ్ఞానాన్ని ఇస్తుంది. ప్రకృతిని పరిశీలించు. అది నీకు ఫలితాన్నిస్తుంది" అన్నాడు.

"భూమి తిరిగి మాట్లాడదు కదా" అని సందేహం వెలిబుచ్చాడు. కాని తండ్రి అప్పటికే చివరి శ్వాస వదిలాడు.

ఆ రోజు నుంచి తండ్రి చెప్పిన రెండు మాటల గురించి పదే పదే ఆలోచించేవాడు. భూమితో మాట్లాడేవాడు. అది బదులు పలికేది కాదు. దాన్ని పరిశీలిస్తుండేవాడు. రుతువుల మార్పుల వల్ల ప్రకృతిలో సంభవించే పరిణామాల్ని నిశితంగా గమనిస్తుండేవాడు కొమరయ్య.

ఏ రకమైన నేలలో నీరు ఎక్కువ నిల్వ వుంటుంది? నీరింకి పోయే నేలలేవి? ఏ పంటలు, ఏ నేలలో బాగా పండుతాయి? అని నిరంతరం ఆలోచించేవాడు. నేలను తవ్వి రకరకాల మట్టి నమూనాలను

పరీక్షించేవాడు. తాను పరిశీలించిన నేలలో వివిధ రకాల విత్తనాలు చల్లి వాటి ఫలితాలు ఎలా వున్నాయో చూసేవాడు. ప్రకృతికి, భూమికి వున్న సంబంధాన్ని బాగా అవగాహన చేసుకున్నాడు.

ఒకనాడు ఉప్పు, కారం, బియ్యం వంటి సరుకులు తెచ్చుకుందామని సంతకు బయలుదేరాడు. దారిలో కొంతమంది బాటసారులు కలిశారు. పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ వెళుతుండగా లేళ్ల గుంపు పరుగెత్తుకుంటూ వెళ్లడం కనిపించింది. "ఏదన్నా క్రూరమృగం వెంటపడిందేమో?" గుంపులోని మల్లయ్య అన్నాడు.

"వర్షం రాబోతోంది. అవి ఆనందంతో పరుగుదీస్తున్నాయి. అయితే వర్షం మాత్రం ఎక్కువ సేపు కురవకపోవచ్చు" అన్నాడు నింగిని, నేలను చూస్తూ కొమరయ్య.

అతను అన్నట్లుగానే ఒక జల్లు కురిసి వెలిసిపోయింది. మరికాస్త దూరం వెళ్ళాక జొన్న చేను నాసిగానూ, పత్తి చేను దట్టంగానూ కనిపించింది. "జొన్నకు నీళ్లు అందడం లేదు కామోసు" అన్నాడు మల్లయ్య.

"నీళ్ల సమస్య కాదు. నేలది సమస్య. ఆ రేగడి నేలలో పత్తి పంటే అనుకూలం. పత్తి పంటే వేసుండాల్సింది" అన్నాడు కొమరయ్య. –

మల్లయ్యకు అతని మాటల్లో నమ్మకం కుదిరింది. "ఇతను పరిశోధన చేసి కనుక్కున్నట్లు చెబుతున్నాడే. ఇంకేమంటాడో చూద్దామని అతని వెంటే సంతకు వెళ్ళాడు. తనకు కావలసిన సరుకుల కొనుక్కొని దాహం కావడంతో మంచి నీళ్ళు అడిగాడు కొమరయ్య.

"కోసెడు దూరం పోయి ఎత్తుకు రావలసివస్తోంది నాయనా" అన్నది మంచి నీళ్లిస్తూ ముసలమ్మ.

"ఈ దగ్గరలో బావులే లేవా?" అడిగాడు కొమరయ్య. 'గతంలో మూడు, నాలుగు చోట్ల తవ్వి చూశారు కానీ నీళ్లు పడలేదు" అంది.

నీళ్లు తాగి "నేను చూస్తాను" అని సంతచుట్టూ వున్న నేలను అక్కడక్కడా గునపంతో తవ్వి చూశాడు ఒంపులో ఒకచోట సుద్దకట్టురాళ్లు కనిపించాయి. "ఇక్కడ తవ్వండి. మంచినీళ్ల బావి పడుద్ది" అన్నాడు.

అతని వెనకాలే తిరుగుతున్న మల్లయ్య కొంత మందిని పోగు చేసి, బావి తవ్వించాడు.

ఆశ్చర్యం! పది అడుగుల వద్దనే తడి కనిపించింది.

మల్లయ్య, కొమరయ్యను వెంటబెట్టుకొని రాజప్రాసాదానికి తీసుకుపోయాడు. మల్లయ్యే మారు వేషంలో వున్న మయూర ధ్వజుడు. "మీలో గొప్ప విజ్ఞానముంది. దయచేసి, మీరు నా కొలువులో వుండి, ప్రకృతి వనరుల్ని ఉపయోగించుకుని రాజ్యాన్ని అభివృద్ధి చేయడంలో నాకు తోడ్పాటు నివ్వండి" అన్నాడు రాజు.

.

కొమరయ్య తన గురించి వివరంగా చెప్పి, "నా తండ్రి భూమితో మాట్లాడమన్నాడు. ప్రకృతిని పరిశీలించమన్నాడు. కొన్నేండ్లపాటు ఒంటరిగా పరిశోధన చేశాను. నాకు కొంత విజ్ఞానం అబ్బింది. ఆ సంపదను రాజ్యం కోసం ఉపయోగించడంలో నాకేమీ అభ్యంతరం లేదు" అన్నాడు.

ఆ రోజు నుంచి రాజు కొమరయ్య సలహాలు పాటించి దేశాన్ని స్వయం సమృద్ధిగా తయారు చేసి చుట్టుపక్కల రాజ్యాలన్నింటికంటే అగ్రభాగాన నిలిపాడు.

పుప్పాల కృష్ణమూర్తి

# కష్టే ఫలి

కరీంపేట అనే ఊరులో ఒక కుటుంబం ఉండేది. పూట గడవడమే కష్టమైన పరిస్థితిలో ఆ ఇంటిపెద్ద కన్ను మూశాడు. ఇక కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడి పోయింది. ఇక తన తండ్రి బాధ్యత తాను చేపట్టాలని కుమార్ నిర్ణయించు కున్నాడు. కాని తల్లిని, ఇద్దరు చెల్లెల్లను పోషించడం ఎలాగో తనకు అర్థం కాలేదు. కూలీనాలి చేస్తే వచ్చే డబ్బులతో ఇంటిల్లిపాది రెండు పూటలా తినే పరిస్థితి లేకపోవడంతో కుమార్ దీనంగా ఆలోచించడం మొదలుపెట్టాడు. అప్పుడు తన తండ్రి చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి.. “ఎక్కడ అయితే రాణిస్తావో అక్కడ నువ్వు కష్టపడు... అందులో నీ జీవితం ఉందని నమ్ము.. ఖచ్చితంగా ఏదో ఒక రోజు అనుకున్నది సాధిస్తావు.” తనకు ఆస్తిగా ఏం ఇవ్వకున్నా అంతకంటే ధైర్యం ఇచ్చే మాట చెప్పాడని అనుకున్నాడు కుమార్.

పదో తరగతి వరకే చదువుకున్న కుమార్.. దగ్గర్లో ఉన్న రైల్వే స్టేషన్‌లో సమోసాలు అమ్మే పనికి కుదిరాడు. కొంతకాలానికి సొంతంగా సమోసాలు అమ్మడం మొదలు పెట్టాడు. కుమార్ ఉత్సాహాన్ని చూసిన ఒక ఉద్యోగి ఈ సమోసాలు అమ్ముతూ ఇంత సంతోషంగా ఎలా ఉంటున్నావు. నీ కొచ్చే సంపాదన ఎంత అని అడిగాడు. అప్పుడు కుమార్ తను రోజుకు కనీసం వేయి రూపాయల సమోసాలు అమ్ముతానని చెప్పాడు. దీంతో ఆశ్చర్యపోవడం ఉద్యోగి వంతయింది. అంటే ఎంత లేదన్నా నెలకు ముప్పైవేలు సంపాదిస్తున్న కుమార్ జీవితమే బాగుందన్పించింది ఉద్యోగికి. ఇంత



చేసి నువ్వేం చదువుకున్నావన్నప్పుడు కుమార్ చెప్పిన సమాధానంతో ఉద్యోగి కళ్లు చెమర్చాయి. ఇంతకాలం తాను డిగ్రీలు చేస్తేనే సంపాదిస్తామని భ్రమపడేది కాని.. ఏ డిగ్రీ లేకున్నా గొప్పగా బతకొచ్చని నీ వల్ల తెల్సుకున్నానని చెప్పాడు. అంతేకదా మరి మన ప్రతిభ ఎక్కడుందో తెలుసుకొని.. దానికి కష్టాన్ని జోడిస్తే అందరూ కుమార్‌లు కావొచ్చు..

-ఎస్.సరళాదేవి, కరీంపేట

కథ

# అపాయంలో ఉపాయం

ఒక ఊరిలో రాము అనే ఒక వ్యక్తి కుటుంబం ఉండేది. ఆయన ఒక ఉద్యోగి. తన భార్యపేరు లక్ష్మి. ఆమె గృహిణి. ఆ దంపతులకు ఇద్దరు పిల్లలు.

ఎంతో సంతోషంగా సాగుతున్న ఆ కుటుంబంలో అనుకోకుండా ఒకరోజు సాయంత్రం వేళ ఇద్దరు బిచ్చగాళ్ళు వాళ్ళ ఇంటికి వచ్చారు. వారు చూడడానికి ఎంతో భయంకరంగా ఉన్నారు. ఒక ముద్దెయమ్మ అన్ని రాము భార్యను పిలిచారు. ఆమె బయటకు వచ్చి వారిని చూసి ఇప్పుడే తెస్తాను అని చెప్పి వంటగదిలోనికి వెళ్ళింది. ఆమె ఇంటిలో నుండి అన్నం తీసుకొని వచ్చేసరికి అంతకు ముందు ఇద్దరు ఉన్న బిచ్చగాళ్ళలో ఒక్కరే ఉన్నారని లక్ష్మి భయపడిపోయి అక్కడ ఉన్న బిచ్చగాడిని ఇంకొక వ్యక్తి ఎక్కడికి వెళ్ళిపోయాడు అని అడిగింది. అప్పుడు అతను రాత్రి వేళవుతున్నదని ప్రక్క వీధిలోకి వెళ్ళాడని చెప్పాడు. ఆ బిచ్చగాడు అన్నం తీసుకొని వెళ్ళిపోయాడు.

రాము ఉద్యోగం నుండి ఇంటికి వచ్చాడు. తొందరగా భోజనానికి సిద్ధం చేయి నేను సినిమాకు వెళ్ళాలి. అని భార్య లక్ష్మితో అంటాడు. అప్పుడు ఆమె భయపడిపోయి సినిమాకు వెళ్ళొద్దు అని చెప్తుంది. ఈరోజు చీకటి పడుతున్న సమయంలో ఇద్దరు బిచ్చగాళ్లు వచ్చారు. నేను అన్నం తీసుకువెళ్ళే సరికి ఒక్కడే ఉన్నాడు. నేను అడిగితే ప్రక్క వీధిలోకి వెళ్ళాడని చెప్పాడు. నాకు ఏదో అనుమానంగా ఉంది. అని లక్ష్మి తన భర్తతో చెప్తుంది. అప్పుడు రాము దొంగలు లేరు ఎవరు లేరు తలుపులు వేసుకొని నువ్వు, పిల్లలు నిద్రపోండి అని చెప్పి భోజనం చేసి సినిమాకు వెళ్ళిపోయాడు.



అప్పటికే ఆ బిచ్చగాడు వారికి కనబడకుండా ఇంట్లోకి ప్రవేశించి అటక మీద కూర్చుని చూస్తున్నాడు. ఆమె నిద్ర పోకుండా అలా ఆలోచిస్తూ ఉండగా అతను క్రిందకు దూకాడు. అప్పుడు ఆమె, ఆమె పిల్లలు భయపడ్డారు. వెంటనే లక్ష్మి భయపడుతూ మమ్మల్ని ఏమీ చేయవద్దని ప్రాధేయపడింది. అప్పుడు ఆ బిచ్చగాడు నాకు పకోడి చేయమని బెదిరిస్తాడు. ఆమె భయపడుతూ వంటగదిలోకి వెళ్లి కలాయిలో నూనె బాగా వేడి చేసిన తరువాత పకోడిచేసి పెడుతుంది. ఒకవేళ పకోడి తిన్న తరువాత తనని, తన పిల్లల్ని ఏమైనా చేస్తాడేమోనని ఆమె భయంతో కలాయిలో ఉన్న వేడి నూనె ఆ దొంగ మీద పోసి దొంగ దొంగ

అనుకుంటూ బయటికి అరుచుకుంటూ బయటికి వస్తుంది. ఆ అరుపుతో వీధిలో వారంతా అక్కడికి వచ్చి ఏమైందమ్మా అని అడిగితే జరిగిన విషయమంతా చెప్తుంది. వీధిలో వారు నీ భర్త ఎక్కడికి వెళ్ళాడు అని అడుగుతారు. ఆమె, నేను ఎంత చెప్పినా వినకుండా సినిమాకు వెళ్ళాడు అని చెప్తుంది.

అప్పుడే వీధిలో ఒక వ్యక్తి పోలీసులకు ఫోన్ చేసాడు. అక్కడికి పోలీసులు వచ్చి ఆమెను అన్ని విషయాలు అడిగారు. అప్పుడు ఆమె, మా ప్రాణాలు కాపాడు కోవడం కోసం అతని మీద వేడినూనె పోశాను అని చెప్తుంది. ఒక పోలీసు నీవు చాలా మంచి పని చేసావమ్మా! నీలాగే ప్రతీ ఒక్క మహిళ ధైర్యంగా ఉంటే సమాజం బాగుపడుతుందని లక్ష్మిని మెచ్చుకున్నారు. ఆమె చేసిన పనికి అభినందించి కొంత డబ్బును బహుమతిగా ఇచ్చారు. అదే సమయంలో రాము ఇంటికి వచ్చాడు. పోలీసులు రాముని, ఆమెకు భయంగా ఉందని చెప్పినా సినిమాకు ఎందుకు వెళ్ళావని మందలించారు. కొంతసేపటికి ఆ బిచ్చగాడిని ఆసుపత్రిలో చేర్పించారు.

– యన్. లక్ష్మీప్రసన్న

10వ తరగతి

జెడ్.పి.హెచ్.ఎస్., రాయిగూడెం

కథ

# నిజాయితీ



అనగనగా ఒక ఊరు ఆ ఊరి పేరు నేలకొండపల్లి. ఆ ఊరిలో రామయ్య, సోమయ్య అనే ఇద్దరు వ్యక్తులు నివసిస్తుండేవాళ్ళు. రామయ్య తనది కాని వస్తువు ఏది ఉంచుకోడు. అది ఎంత విలువైనదైనా ఉంచుకోడు. కాని సోమయ్య మాత్రం తనది కాని వస్తువు అయినా ఆ వస్తువును వదులుకోడు. అది విలువ ఉన్నదైనా లేనిదైనా.

రామయ్య, సోమయ్య మంచి మిత్రులు. ఒకరోజు వాళ్ళిద్దరూ సినిమాకి వెళ్ళి వస్తుండగా ఒక బంగారు హారం కనిపించింది. సోమయ్య దాన్ని చూసి ఈ హారాన్ని అమ్మితే చాలా డబ్బులు వస్తాయి అని అనుకున్నాడు. రామయ్య ఇది ఎవరిదో వాళ్ళకి ఇద్దాం అని అనుకున్నాడు. సోమయ్య “ఇది ఎవరిదో వాళ్ళకు ఇస్తే నీకు వచ్చేది ఏముంది” అన్నాడు. “నిజాయితీ వస్తుంది” అన్నాడు. రామయ్య అన్న మాటలకు సోమయ్య మారిపోయాడు. అది ఎవరి హారమో వాళ్ళకు ఇచ్చేసాడు. అప్పటి నుండి సోమయ్య ఎవరి వస్తువు తీసుకునేవాడు కాదు. వాళ్ళకు సహాయం చేసేవాడు.

**నీతి :** నిజాయితీగా ఉంటే మనల్ని అందరూ గౌరవిస్తారు.

– పి. రేణుక భవాని

కథ

# రసగుల్లా రాజ్యం



ఒకానొకప్పుడు వంగదేశంలో రసగుల్లా రాజ్యం ఉండేది.

మహారాజశ్రీ హాబూ చంద్రుడుగారు ఆ రాజ్యానికి రాజు. మరి గౌరవనీయులైన గాబూ చంద్రుడుగారేమో ఆ రాజు గారికి మంత్రి.

రాజుగారు లావుగా, గుండ్రంగా ఉండి మహత్తరమైన విజ్ఞానవంతుడిలా ఉండేవారు. గాబూ చంద్రుడు తాడిచెట్టులా పొడుగ్గా ఉండి, ఆ పొడుగుకి మించిన తెలివితేటలో కనిపించేవాడు. వాళ్లిద్దరూ విడదీయరాని స్నేహితుల జంటగా ఉండేవారు. వాళ్లేం మాట్లాడుకుంటున్నారో నర మానవుడికి తెలిసేది కాదు. ఎప్పుడూ రాజుగారు నవ్వుతూ ఉండేవారు. మంత్రిగారు గర్వంగా చిన్నగా దగ్గి వూరుకునేవారు.

వాళ్ళిద్దరూ ఒక రోజు కోట ఉద్యానవనంలో విహరిస్తూ ఉండగా ఓ లావుపాటి పంది అటుగా పరుగెత్తి పోవడం చూసారు. రాజుగారు "అదేమిటి లావుగా పరిగెత్తుతోంది?" అని అడిగారు.

మంత్రిగారు విచారంగా "ఏం చెప్పమంటారు

మహారాజా! మన రాజ సేవకులు దొంగల్లా తయారయ్యారు" అన్నారు.

రాజు గారికి అర్థం కాలేదు. "ఎందుకలా అంటున్నారు" అని అడిగాడు.

"ఇప్పుడు మనం చూసింది మన సేనలోని ఏనుగుని. అది ఎంత చిక్కిపోయి చిన్నదై పోయిందో చూసారా? ఆఖరికి దాని తొండం కూడా చిన్నదై పోయి ముట్టెలా తయారయింది. మన మావటీలు, పనివాళ్లు దానికి ఆహారం పెట్టకుండా, ఆ డబ్బంతా మింగేస్తున్నట్లున్నారు" అన్నాడు మంత్రి.

మహారాజు గారికి కోపం ముంచుకొచ్చింది. మావటీ వాళ్లను, సేవకులను చీకటి గృహంలో ఖైదీలు చేసాడు.

కొంత కాలం పోయాక అదే పంది రాజు, మంత్రి వెళ్తున్న దారిలో కనిపించింది.

రాజుగారు ఆశ్చర్యంగా "మంత్రిగారూ! మన ఏనుగుల పరిస్థితి ఇంకా మారలేదు చూసారా! అవి ఇంకా అలానే చిక్కి శల్యమై పోతున్నట్లున్నాయి" అన్నారు.

గాబూ చంద్రుడు కాస్సేపు ఆలోచించి, కళ్లు చింతనిప్పుల్లా చేసి, కోపంతో 'రాజా! అరిష్టమంతా మనకోటలోనే ఉంది. అది ఏనుగు కాదు. ఎలుకపిల్ల. మన వాళ్లు ధాన్యాగారాన్ని మూసి ఉంచకుండా వదిలేసి తమ ఇళ్లలో నిద్రపోతున్నట్లున్నారు. మరి ఎలుకలు హాయిగా మేసి యిలా బలిసిపోతున్నాయి. ఇహ ఇలా సాగితే మన రాజ్యంలో కరువు కాటకాలు తాండవిస్తాయి. మనం జాగ్రత్తపడాలి" అన్నాడు.

రాజు గారికి చెప్పాల్సిందేముంది. వెంటనే ధాన్యాగారం సిబ్బంది తలలు తీయించాడు.

అయితే ఓ రోజు పొద్దున్నే రాజుగారు, మంత్రిగారు కోట మేడ మీద వరండాలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. అక్కడికి కోటకి అవతల వున్న ఒక పెద్ద సరస్సు కనిపిస్తోంది. దాన్నిండా చక్కని తామర పూలున్నాయి. వాళ్లలా మాట్లాడుకుంటూ ఉండగానే కొంత మంది యాత్రికులు భుజాన కర్రకి గుడ్డ మూటలు, చేతుల్లో మరచెంబులు పట్టుకొని ఆ సరస్సు దగ్గర ఓ చెట్టు క్రిందికి వచ్చి కూర్చున్నారు. వంటకుపక్రమిద్దామని అందులో కొంత మంది పొయ్యి రాజేయడానికని చిన్న గుంటలు తవ్వడం మొదలు పెట్టారు. అది చూసి రాజు గారు, "మంత్రిగారూ! ఎందుకలా తవ్వుతున్నారు" అని అడిగారు. –

మంత్రి గారు పరిశీలనగా వాళ్లని చూసి రాజు గారితో రహస్యంగా "దొంగ వెధవలు! పట్ట పగలు మన సరస్సులోని నీళ్లన్నీ లాగేద్దామని సొరంగాలు తవ్వుతున్నారు. వీళ్లకు ఎంత ధైర్యం మహారాజా!" అన్నాడు.

వెంటనే రాజుగారు ఆ పేద యాత్రికుల్ని బంధించి ఉరితీయించాడు.

రసగుల్లా రాజ్యంలో ప్రజలు నిశ్చింతగా, శాంతియుతంగా గడిపేస్తున్నారు. మరి రాజు, మంత్రుల తెలివితేటలు, న్యాయపరిజ్ఞానం అంత హాస్యాస్పదంగాను, నిరాటంకంగానూ సాగిపోతూనే ఉన్నాయి.

ఇది ఇలా ఉండగా ఒక రోజు ఓ సాధువు, కాబ్లా అనే ఆయన శిష్యుడు ఆ రాజ్యంలోకి వచ్చారు. గుడి దగ్గర విశ్రాంతి కోసం అని ఆయన ఆగాడు. శిష్యుడికి రెండు పైసలిచ్చి కాసిని మరమరాలు, పటికబెల్లం కొని తీసుకురమ్మని బజారుకి పంపాడు. కాని వెళ్లిన వాడు పెద్ద కుండ నిండా రసగుల్లాలు తీసుకొచ్చాడు.

వచ్చి "ఇక్కడ చాలా ఆశ్చర్యం, అద్భుతంగా వుంది. రాజ్యంలో ఏ రకం తిండైనా సరే ఒక పైసా

మాత్రమే ఖరీదు చేస్తుంది. ఎంత కావాలంటే అంత తిండి ఒక్క పైసాకే కొనొచ్చుట. అంతే! నేను శుభ్రంగా బోలెడు రసగుల్లాలు తిన్నాను. మీ కోసం ఓ కుండనిండా పట్టుకొచ్చాను", అని ఆ పిల్లాడు గురువుగారితో అన్నాడు.

అది విన్న సాధువు చాలా కంగారు పడ్డాడు. "మనం ఇక్కడ నుంచి వెంటనే వెళ్లిపోవాలి. ఇది చాలా ప్రమాదకరమైన ప్రదేశంలా ఉంది. ఇక్కడ ఎవరికి నియమాలు, నైతిక విలువలు లేనట్లున్నాయి. దీని ప్రకారం చూస్తే ఇక్కడ విజ్ఞానం, న్యాయం అనేవి శూన్యం అనిపిస్తోంది. ఇది పిచ్చివాడి రాజ్యం. మనం తక్షణం వెళ్లిపోదాం పద" అన్నాడు.

కాని అమాయకుడైన శిష్యుడు మాత్రం ఒప్పుకోలేదు. "నాకు ఇది భూతల స్వర్గంలా కనిపిస్తోంది. మనం ఎప్పటికీ ఇక్కడే ఉండిపోదాం" అన్నాడు.

"నాయనా! నువ్వు చిన్నవాడివి. అమాయకుడవు. అత్యాశకుపోయి ఇక్కడే ఉంటే కష్టాల్లో ఇరుక్కుపోతావు" అని బుజ్జగించి చెప్పాడు గురువు.

"అయ్యా! నేను నా జీవితమంతా మరమరాలు తిని, మంచి నీళ్లు తాగి బతకలేను. మీతో ఉంటే నాకంతకన్నా దొరికేదేమీ లేదు. నేనీ రాజ్యంలోనే ఉండిపోతాను" అన్నాడు శిష్యుడు.

"సరే నాయనా! నీవిక్కడే ఉండు. నేను వెళ్తాను. కాని నాకెందుకో నువ్వు చెడ్డ ప్రమాదంలో ఇరుక్కుంటావని అనిపిస్తోంది. అలాంటి పరిస్థితి వస్తే నన్ను తప్పక తలుచుకో. నేను వచ్చి నిన్ను రక్షిస్తానని" చెప్పి సాధువు వెళ్లిపోయాడు.

సరిగ్గా సాధువు, శిష్యుడు ఇలా అనుకొంటున్న సమయంలోనే మన రాజుగారి న్యాయస్థానంలో చాల ముఖ్యమైన సంఘటన జరిగి పోయింది. రాజాధిరాజు హాబూ చంద్రుడు సింహాసనాన్ని, గాబూ చంద్రుడు మంత్రి పీఠాన్ని అధిష్టించి న్యాయస్థానాన్ని అలంకరించి ఉండగా అనుకోని భయంకరమైన వార్తను మోసుకుని ఒక వార్తాహరుడు వచ్చాడు. ఆ వార్త ఏమిటంటే నగరంలోని పెద్ద గజదొంగ ధనవంతుడైన ఒక కామందు ఇంటికి కన్నం వేస్తుండగా, ఆ తవ్వుతున్న మట్టిగోడ విరిగిపడి అతను మరణించాడు. ఈ వార్త మన రాజుగారికి, మంత్రిగారికి ఆశనిపాతంలా తగిలింది. వాళ్లిద్దరూ విషణ్ణవదనులై కన్నీరు కార్చారు.

"ఎంత దారుణం! ఈ విధంగా చనిపోవడం చాల అన్యాయం! రాజుగారి న్యాయ విచారణ లేకుండా ఇలా చావడం భరించలేము. ఇక ముందు ఇలా సాగితే మన రాజ్యం ఏమవుతుంది? మన రాజ్యంలోని ప్రజలకు భద్రత కరువవుతోందని" మంత్రిగారు అరిచారు. "దీనికంతకూ అసలు కారకుడెవరో? అసలు మట్టిగోడ కూలడం ఏమిటి? మన నగర రక్షణ సేనాని తన బాధ్యత సరిగా నిర్వహించకపోవడం వల్ల ఇలా జరిగింది. అతను తన కర్తవ్యం విస్మరించడం వల్లనే ఇళ్ళగోడలు పుచ్చిపోయి ఇలా కూలిపోతున్నాయి" అన్నారు.

వెంటనే రాజుగారు నగర రక్షణ సేనానికి ఉరిశిక్ష వేయాలని తీర్పు చెప్పారు.

నగర రక్షణ సేనాని రాజుగారి కొలువుకి వచ్చి "మహారాజా! నా తప్పేమీ లేదు. ఆ కూలి పోయిన గోడ నగరంలో లేదు. నగరం బయట ఉన్న గ్రామంలో ఉంది. అదీకాక ఎవరి ఇల్లు పుచ్చిపోయిందో, ఎవరి గోడలు బీటలు పడ్డాయో నాకెలా తెలుస్తుంది? ఆ బాధ్యత పూర్తిగ ఇంటి యజమానిదే. కాబట్టి ఆ దొంగ చనిపోవడానికి కారణం వాడు కన్నం వేస్తున్న ఇంటి యాజమానే కాని మరెవ్వరూ కాదు" అన్నాడు.

రాజుగారు వెంటనే దొంగ కన్నం వేస్తున్న ఇంటి

యజమానిని లాక్కు రమ్మన్నాడు.

రాజుగారి అశ్విక భటులు గ్రామానికి వెళ్ళి ఇంటి యజమానిని కొలువుకు లాక్కొచ్చారు. అతను చేసిన భయంకర నేరం, దానికి శిక్ష ఆ యజమానికి తెలియచేసారు. అతను "అయ్యా! ఇందులో నా తప్పేమీ లేదు. అసలు అది కొత్తగా కట్టించిన గోడ. నిజం చెప్పాలంటే ఆ గోడ ఇంకా పూర్తిగ ఆరను కూడా లేదు". అన్నాడు.

"అరే! అలాగయితే ఆ గోడ ఎందుకు కూలినట్టూ, దొంగ ఎందుకు చచ్చినట్టూ?" అన్నారు మంత్రిగారు ఏమీ అర్థం కానట్టు.

"అయ్యా! నాకు మాత్రం ఏం తెలుస్తుంది? ఆ గోడ కట్టిన వాడికి తెలియాలి. అయినా ఇల్లంటే నాది గాని, నేనేమన్నా స్వయంగా గోడలు కడతానా'! అన్నాడు ఇంటి యజమాని. "అయితే దీనంతటికీ కారణం ఆ గోడ కట్టినవాడే. ఇంత నిర్లక్ష్యంగా పనులు చేస్తే మన రాజ్యం గతేం కాను? వాడిని వెంటనే శిక్షించాలి" అన్నారు మంత్రిగారు.

"వాడిని తీసుకొచ్చి రేపు ఉదయమే తల నరికించండి" అని రాజుగారు శెలవిచ్చారు. యధాప్రకారం ఆఘమేఘాల మీద భటులు ఆ గోడ కట్టిన వాడిని బంధించి తీసుకొచ్చారు. వాడి తప్పుని, దానికి పడిన శిక్షని వాడికి తెలియజేసారు. వాడు "మహాప్రభూ! నేను ఎంతో కష్టపడి నైపుణ్యంతో ఆ గోడను కట్టాను. అసలు గోడ కట్టడానికి కావలసిన సున్నం, మట్టి తయారు చేసే వాడిని అడగాలి. అది మంచిదో కాదో! అంతే కాని ఇంత దారుణమైన హత్యకు నన్ను బాధ్యుణ్ణి చేస్తారా? నేను ఏ పాపం ఎరుగను" అని వాపోయాడు.

ఇక మంత్రిగారు విజృంభించారు. "అవును మరి! వాడు ఎలాంటి సున్నం, మట్టి ఇచ్చాడో. వాణ్ణి శిక్షిస్తే సరి. ఇక మన రాజ్యంలో అలా పనికిరాని, కల్తీ వస్తువుల్ని సరఫరా చేయడానికి ఎవ్వరూ సాహసించరు."

ఆ సున్నం, మట్టిని తయారుచేసిన వాడిని నడి బజారులో ఉరి తీయమని రాజుగారు ఆజ్ఞాపించారు.

రాజుగారి అశ్విక భటులు క్షణాల్లో ఆ మట్టి తయారు చేసేవాడిని తీసుకొచ్చి పడేసారు. కానీ అతనూ తన తప్పేమీ లేదని తేల్చేసాడు. "అయ్యా! నేను నాణ్యమైన మట్టినే సరఫరా చేసాను. కాని రాత్రి పూట కుండల్లోంచి చాల నీళ్లు కారి పోయుండొచ్చు. నీకు కుమ్మరి వాడు సరయిన కుండలివ్వలేదు. కారిపోయే కుండలు ఇచ్చాడనుకుంటాను" అన్నాడు.

అయితే మంచి కుండలివ్వని కుమ్మరి నేరస్థుడుగాని, ఏమీ తెలియని సున్నం పని వాడిని అని ఏం లాభం? వెంటనే కుమ్మరిని తీసుకురండి" అన్నారు మంత్రిగారు.

కుమ్మరిని తీసుకొచ్చి, నడివీధిలో అతని తల నరికేయమని రాజుగారు. శెలవిచ్చారు. రాజుగారి భటులు వెళ్ళి కుమ్మరిని తీసుకొచ్చారు. కుమ్మరి కూడ తాను నేరస్థుడిని కానని వాదిస్తూ ఇలా అన్నాడు. నేను మంచివాడినని, నమ్మకస్తుడనని నగరంలో అందరికీ తెలుసు.

కాని కుమ్మరి పని ఎంత కష్టం. చూడ్డానికి కూడ ఎంతో చక్కగా, నున్నగా మెరుస్తూ ఉన్నా సరిగ్గా కాలకపోతే అది కన్నాలు పడ్డం, బీటలు రావడం ఖాయం. కుండలు సరిగా కాలకుంటే చక్కగా ఎండిన కర్రలు కావాలి. కట్టెలు కొట్టేవాడు మంచి కర్రల నివ్వక పోతే కుమ్మరి పడిన శ్రమంతా వృథా అయిపోతుంది. కాబట్టి మహారాజా! నా కుండలు కారడానికి కారణం ఆ కట్టెలు కొట్టేవాడే కాని మరెవ్వరూ కాదు."

మంత్రిగారు వెంటనే అందుకున్నారు. "నిజమే! ఆ కట్టెలు కొట్టే వాడిని తీసుకురండి" అన్నారు.

రాజుగారు మళ్ళీ కొత్త ఆజ్ఞ జారీ చేసారు. కట్టెలు కొట్టేవాడిని తీసుకొచ్చి ఉరి తీయమని.

పాపం! ఎక్కడో అడవిలో కట్టెలు కొట్టుకుంటున్న వాడిని భటులు లాక్కొచ్చారు. వాడు చాల అమాయకుడు. రాజుగారి ఆస్థానంలో ఏం జరుగుతుందో వాడికేమీ అర్థం కాలేదు. వాడిని ఆ రాత్రికి జైలులో పెట్టారు. ఆ రాత్రి వాళ్ల మాటల వల్ల వాడికి అర్థం అయిపోయింది, ఇక్కడ ఉంటే వాడి ప్రాణానికి ముప్పొచ్చేలా ఉందని. వాడు మహాకాయుడు. అడవి పులంత బలాఢ్యుడు. పరిస్థితి అర్థం కాగానే ఒక్క గెంతు గెంతి అక్కడున్న కాపలా వాళ్లను విదిలించుకొని అడవిలోకి పారిపోయాడు. అతన్ని పట్టుకొని బంధించడానికి ఇక ఎవరికి సాహసం లేక పోయింది.

కట్టెలు కొట్టేవాడు అడవిలోకి పారిపోయిన తర్వాత కథ కంచికెళ్లి ఉండాల్సింది. కాని 'రసగుల్లా' మహారాజ్యంలో అలా జరగలేదు. ప్రధానమంత్రి గాబూచంద్రుడు ఇలా ప్రకటించాడు. "నిజమైన నేరస్థుడు శిక్షను తప్పించుకున్నాడు. మనం రేపు ఉదయం బహిరంగంగా ఎవరో ఒకరి తలను నరికించాలి. కాబట్టి గౌరవనీయులైన భద్రతాధికారి గారూ! నేరస్థునికి సరయిన ప్రతినిధిగా ఎవరినయినా పట్టుకురండి. రేపు ఉదయం అతన్ని శిక్షిద్దాం. రాజ్యంలో న్యాయం, శిక్ష లేకుండా ఏ రాజూ ప్రఖ్యాతి గాంచడు" అన్నారు.

"అవును. అదే సబబు. నేరస్థులంతా నా న్యాయరీతికి, శిక్షకు అర్థం లేకుండా చేస్తుంటే నేను రాజుగా ఎలా కొనసాగగలను? కాబట్టి రేపు ఉదయం నా కళ్లెదురుగా ఒక నేరస్థుడి తల నరికి శిక్షించాలి. దానిక్కావలసిన ఏర్పాట్లన్నీ తొందరగా చేయండి" అని ఆదేశించారు రాజుగారు.

ఆ రోజుకి న్యాయస్థానం తన పనిని ముగించింది.

సూర్యోదయానికి కొంచెం ముందుగా గుడి మెట్ల మీద పడుకొని నిద్రపోతూ కుండల నిండా రసగుల్లాలు తింటున్నట్లు కలలు కంటున్న కాబ్లాని భద్రతాధికారి బంధించాడు.

నేరస్థుడి శిరచ్ఛేదనని వీక్షించడం కోసం నగర ప్రజలంతా ఉదయం నడి బజారులో గుమికూడారు. బజారు మధ్యలో పెద్ద చెక్క దిమ్మ ఉంది. దాని పక్కనే గొడ్డలి పట్టుకొని తలారివాడు నిలబడి ఉన్నాడు. కొంచెం దూరంలో ఒక వేదిక మీద రాజుగారి కోసం, మంత్రిగారి కోసం ఉన్నతాసనాలు అమర్చి ఉన్నాయి. ఆ వేదికకు ఎదురుగా సాయుధులైన సైనికులు బుద్ధిహీనుడైన, దురాశపరుడైన కుర్రవాడు (బొద్దుగా ఉన్నా ప్రస్తుతం పాలిపోయి వణుకుతున్నాడు) కాబ్లాని బంధించి పట్టుకున్నారు. తన గురువు గారి కన్నా, వారి సలహా కన్నా రసగుల్లాలను ఎక్కువ ప్రేమించడాన్ని గుర్తు చేసుకుని ఇప్పుడు చాల విచారిస్తున్నాడు కాబ్లా. ఇప్పుడతనికి ఎప్పుడూ లేనంతగా గురువుగారు గుర్తుకొస్తున్నారు.

కళ్ల నిండా నీళ్లు నింపుకుని విచారంగా చుట్టూ చూసాడతను. అంతమంది జనంలోనూ ఒక్క తెలిసిన ముఖం లేదు. ఆ జనం అంతా రాజుగారి రాకకోసం, వచ్చాక అతనిచ్చే ఆజ్ఞ కోసం ఎదురు చూస్తున్నారు. జనంలో చాలా మంది కాబ్లా వంక చూసి చిన్నగా నవ్వుతున్నట్లనిపించింది. కాని అలా ఎందుకు చూసి నవ్వుతున్నారో కాబ్లాకి అసలు అర్థం కాలేదు. అతను లావుగా, బుద్ధిహీనుడిలా కనిపించడం వల్లే జనం అతన్ని చూసి నవ్వుతున్నారు.

హఠాత్తుగా బాకాలు వినిపించాయి. రాజుగారు

తన ప్రధానమంత్రితో సహా అక్కడ ప్రత్యక్షమయ్యారు. వాళ్ళు వేదిక నెక్కారు. రాజుగారు ఆసీనులయ్యారు. పొడగరి, గెడ్డ ముక్కు కలవాడయిన ప్రధానమంత్రి గట్టిగా ప్రజలనుద్దేశించి ప్రసంగించాడు. కాని కాబ్లాకి ఏమీ అర్థం కాలేదు. 'న్యాయం', 'శిక్ష', 'నేరస్థుడు' అనే మాటలు అసలు అతనికి అర్థరహితాలే అయ్యాయి.

అప్పుడే మంత్రిగారి ఉపన్యాసం ముగించే సమయానికి, మన ముసలి సాధువుగారు జనంలోంచి వచ్చి వేదిక ముందు నుంచున్నారు.

సాధువు కాబ్లా వైపు కోపంగా చూసి "ఓరి పాపాత్ముడా! స్వర్గానికి పోవాలని కలలు కంటున్నావా? ఎంత ధైర్యం! నేను నా జీవితమంతా సత్కార్యాలు చేసిన వాడిని. ఈ రోజు నా తల నరికేయాలసలు" అని గట్టిగా అరిచాడు.

హాబూ చంద్రుడి వైపు తిరిగి ఈ విధంగా బతిమాలాడు "ఓ మహారాజా! దయచేసి నా తల నరికించండి. ఈ ఉదయం వెయ్యి సంవత్సరాల్లో వచ్చే పవిత్రమైన ఉదయాలన్నింటికంటే అతి పవిత్రమైనది. మీ రాజ్యం ప్రపంచంలో ఉన్న అన్ని పవిత్ర ప్రదేశాల్లోకెల్ల పవిత్రమైంది. ఈ రోజు ఇక్కడ నా శిరచ్ఛేదన జరిగితే నేను నేరుగా బొందితో స్వర్గానికి చేరుకుంటాను. ఇదంతా పవిత్ర గ్రంథాల్లో రాయబడి ఉంది. నేను హిమలయాల్లోని నా ఆశ్రమాన్ని వదలి ఈ ఉదయం మీ తలారి వాడి చేత శిరచ్ఛేదన చేయించుకోడానికి వచ్చాను.

ఓ 'రసగుల్లా' దేశపు రాజా! నా తల నరకమని మీ తలారి వాడికి ఆజ్ఞ ఇవ్వండి" అన్నాడు.

అలా అని సాధువు చెక్క దిమ్మ దగ్గరకు పోయి, వంగి కూర్చున్నాడు. తన తలను చెక్క దిమ్మ మీద ఉంచబోతుండగా హబూచంద్రుడు తన ఆసనం మీద నుంచి గట్టిగా 'ఆగు' అని అరిచి అయోమయంగా ప్రధానమంత్రి వైపు చూసాడు.

గాబూ చంద్రుడు సాలోచనగా 'అయ్యా' అంతా సరిగ్గానే చెప్పాడు. ఈ రోజు శిరచ్ఛేదన గావించ బడ్డవాడు బొందితో స్వర్గానికి చేరుకుంటాడు. ఈ అవకాశాన్ని నేను వదులుకోకూడదు. కాబట్టి ముందు నా శిరచ్ఛేదనకి అనుమతి ఇవ్వండి" అన్నాడు.

"కాదు. అలా ఎన్నటికీ కాదు" కోపంగా అరిచాడు రాజు. "ఇక్కడ నేను రాజును, ముందు నాకే శిరచ్ఛేదన చేయాలి. నేనే ముందు స్వర్గానికి చేరుకోవాలి" అని వేదిక నుంచి కిందికి దూకి చెక్క దిమ్మ ముందు నిలబడి సాధువుని అక్కడ నుంచి తప్పుకోమన్నాడు. సాధువు కాబ్లా దగ్గరికెళ్ళి, బంధ విముక్తుడ్ని చేసి త్వరగా అతనితో కలిసి జనంలో మాయమయ్యాడు.

రాజుగారు వంగి కూర్చుని తన తల చెక్క దిమ్మ మీద ఉంచి వెంటనే తన తల నరకమని ఆదేశించాడు. తలారి రాజుగారి తల నరికేసాడు.

రాజుగారు బొందితో సహా ఆకాశంలో ఎగురు కుంటూ పోయి స్వర్గంలోకి మాయ మవుతారేమో చూడాలని జనం ఆశించారు. కాని అలా జరగలేదు. జనం ప్రధానమంత్రి నాయకత్వంలో అక్కడ నుంచి పారిపోయారు.

కొద్ది రోజుల్లో గాబూచంద్రుడు పిచ్చివాడ య్యాడు. ఎందుకంటే ఎక్కడ ఎప్పుడు చూసినా అతనికి రాజుగారి దెయ్యమే ప్రత్యక్షమయ్యేది.

అయితే సాధువు, కాబ్లా ఇంకెప్పుడూ 'రసగుల్లా రాజ్యానికి తిరిగి రాలేదు.

– చిత్త ప్రసాద్ కథలు
అనువాదం: డా॥ రోష్నీ

# అమ్మమాట

తల్లికాకి ఆహారం తీసుకుని ఇంటికి వచ్చేసరికి పిల్లకాకి గూట్లో లేదు. తల్లి కాకికి బోలెడంత దిగులేసింది.

"ఎగరటం కూడా పూర్తిగా రాలేదు. ఎక్కడికి వెళ్ళిందో ఏమిటో!" అని బాధపడుతూ కిందకు వెళ్ళి చూసి వచ్చింది. ఎక్కడా లేదు. తల్లికాకి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.



తెచ్చిన ఆహారం వైపు చూస్తూ.. "తీసుకురాగానే గబగబా తినేసేది. ఎంత బాగుందో అమ్మా. కడుపు నిండిపోయింది" అని కూడా అనేది. పిచ్చి పిల్ల. ఏమన్నా తిందో లేదో" అని కళ్ల నీళ్ళు పెట్టుకుంది. ఇంతలో మెల్లగా వచ్చింది పిల్లకాకి.

దానిని చూడగానే చాలా ఆనందపడిపోయింది తల్లికాకి. గబగబా దగ్గరకు తీసుకుని ముద్దులు పెడుతూ.. "ఎక్కడికి వెళ్ళావు? ఎంత భయపడ్డానో తెలుసా. ఆకలి వేస్తుందా? ఇదిగో తిను" అంటూ గబగబా తెచ్చిన ఆహారాన్ని పిల్లకాకికి తినిపించ బోయింది.

"అమ్మా..! నాకు వద్దు. ఆకలిగా లేదు" అంది పిల్లకాకి దూరంగా జరుగుతూ.

"చాలసేపు అయ్యింది కదా తిని! ఆకలి ఎందుకు లేదు?" అంది బాధగా తల్లికాకి. అది విని..

"ఇప్పుడే తిన్నానమ్మా?" అంది పిల్ల కాకి.

"ఎక్కడ తిన్నావు?" అంది తల్లికాకి ఆశ్చర్యంగా చూస్తూ.

"పైన ఉంటున్న కొంగ మామ వాళ్ళింట్లో.."

"అవునా. వాళ్ళెలా తెలుసు నీకు?" అంది తల్లికాకి అయోమయంగా.

"తెలుసమ్మా. నువ్వు బయటికి వెళ్ళినప్పుడు అప్పుడప్పుడూ మన ఇంట్లో నుండి బయటికి వచ్చి మెల్ల మెల్లగా కొమ్మలన్నీ తిరిగేదాన్ని కదా. అప్పుడు ఒక కొంగ పిల్ల జత అయ్యింది. నాకు బతికి ఉన్న చేపని పెట్టిందమ్మా. భలే ఉందమ్మా." అంది పిల్ల కాకి ఆ రుచినే తలచుకుంటూ.

ఏం చెప్పాలో తెలియ లేదు తల్లికాకికి. ఆ తర్వాత కూడా చాలాసార్లు అక్కడే తింటూ ఉండటంతో ఇక చెప్పక తప్పదు అనుకుని ఒక రోజు తల్లికాకి పిల్ల కాకిని పిలిచి..

"నువ్వు పెద్దదానివి అవుతున్నావు. నేను తెచ్చిన ఆహారమో, వాళ్ళు పెట్టిందో ఏదో ఒకటి ఇప్పటి వరకూ తిన్నావు. ఇక నీ ఆహారాన్ని నువ్వు సంపాదించుకునే వయసు వచ్చింది నీకు. రేపటి నుండీ నువ్వు నా వెంట రా. ఆహారం ఎలా సంపాదించు కోవాలో నేర్పుతాను.." అంది.

"సరే అమ్మా..!" అని మర్నాడు తల్లి కూడా

బయటికి వెళ్ళింది పిల్లకాకి. అక్కడ ఒక చనిపోయిన ఎలక కనిపించి ఆగిపోయింది తల్లికాకి. తను తింటూ పిల్ల కాకిని తినమని చెప్తూ ఎలా తినాలో, తినేటప్పుడు చుట్టూ ఎలా ఒక కన్ను వేసి ఉంచాలో చెప్పింది. ఊ కొట్టింది తప్ప అది తినలేదు. సరేలెమ్మని అది తాను తినేసి మరో చోటికి పిల్లకాకిని తీసుకు వెళ్ళింది. అక్కడ కొన్ని ఎంగిలి మెతుకులు కనిపిస్తే తినమని తల్లికాకి చెప్పింది. అవి కూడా వద్దని చెప్పి తినలేదు పిల్ల కాకి.

మరి కొంత దూరం వెళ్ళాకా ఒకచోట సగం ఎవరో తిని వదిలేసిన జింక కళేబరం కనిపించి చాల సంతోషపడిపోయింది తల్లి కాకి కడుపునిండా తినవచ్చని. అయినా తినటానికి పిల్లకాకి ఇష్టపడలేదు. ఎందుకు తినను అంటుందో తల్లికాకికి అర్థం కాలేదు. చీకటి పడిపోతూ ఉండటంతో గూటికి చేరుకున్నారు తల్లీ, పిల్లా. బిడ్డ ఆకలిగా ఉండటంతో తల్లికాకికి చాల బాధ కలిగి..

"ఎంత ఆహారం దొరికిందో ఈరోజు. తినకపోతే ఆకలి వేస్తుంది కదా? అయినా ఎందుకు తినను అన్నావు?" అని అడిగింది.

"అవన్నీ ఇంకొకళ్ళు తిని వదిలేసిన ఆహారం అమ్మా. వీటన్నిటి కంటే నాకు నా స్నేహితురాలు కొంగ పెట్టిన బతికి ఉన్న చేపని తినటమే ఇష్టంగా ఉంది" అంది పిల్ల కాకి. దాంతో చాల బాధపడిపోయింది తల్లికాకి.

"మనంతట మనం కష్టపడి సంపాదించుకున్న ఆహారం రుచి ఎవరో పెట్టిన దానిలో నీకు కనిపించినదా? అయినా చేపలు కొంగల ఆహారం. అవి బతికి ఉన్న వాటినే పట్టుకుని తింటాయి. అది వాళ్ల అలవాటు. చేపలు మన ఆహారంలో ఒక భాగం మాత్రమే. అయినా ఎన్నాళ్ళు పెడతారు వాళ్ళు నీకు? స్నేహం కొద్దీ మరి కొద్ది రోజులు పెట్టవచ్చు. అవీ, మనమూ ఎప్పుడూ ఇక్కడే ఉండము కదా. చెట్లు మారి పోతాము. ఎక్కడెక్కడికో వెళ్ళిపోతాము. కాబట్టి అలా వాళ్ల మీద ఆధారపడకు" గట్టిగా చెప్పింది తల్లికాకి.

"కాదమ్మా! తను చాల మంచిది. చేపలు ఎలా పట్టాలో నాకు నేర్పుతానంది. నేర్చేసుకున్నాను అనుకో. రోజూ బతికి ఉన్న చేపలే తినవచ్చు. నీకు కూడా తెస్తాను అమ్మా.." అంది పిల్లకాకి.

అది విన్న తల్లికాకికి చాల భయం వేసింది. దాంతో.. దగ్గరకు రమ్మని తల మీద చేయి వేసి నిమురుతూ.. "నీకు అర్థం కావటం లేదు తల్లీ. వాళ్లు నీళ్లల్లో ఈదుతున్న చేపను పట్టగలరు. అందుకు వీలుగా పొడుగు ముక్కు, పొడుగు కాళ్ళు వాళ్లకి ఉన్నాయి.. మనకి అంత పొడవు ఉండవు. మనం పట్టలేం. పట్టాలని ప్రయత్నిస్తే ప్రమాదం. కాబట్టి నా మాట విని అలాంటి ఆలోచన మానుకో" అంది తల్లికాకి.

"కాదమ్మా..! చేపని చాల తేలికగా పట్టెయ్యొచ్చుట. కొంగ చెప్పింది. రేపు తీసుకు వెళతాను అంది కూడా.."

'బయటికి వెళ్ళి చేపలు పట్టేంత పెద్దదా నీ స్నేహితురాలు?" అంది తల్లికాకి.

"కొంచెమే పెద్దది. వాళ్లమ్మ నేర్పిందట. కొత్తగా నేర్చుకుంది కదా. అందుకే అస్తమానూ వెళ్ళి చేపలు పట్టేస్తుంది. ఒకరోజు నా కోసమని వెళ్ళి పెద్ద చేపని పట్టుకుని వచ్చింది తెలుసా. ఆ చేప అలా కదులుతూ ఉంటే తినటం భలేగా ఉందమ్మా.." అంది పిల్లకాకి లొట్టలేస్తూ.

అది విన్న తల్లికాకికి చాల దిగులేసింది. ఎంత చెప్పినా వినేట్టు లేదని తల్లికాకికి అర్థం అయ్యింది. మర్నాడు ఉదయం తన బాధని పక్క గూట్లో ఉన్న మరో కాకితో పంచుకుంది.

"పసిపిల్లలు అంతే. ఎవరు ఏది చెప్తే అదే వింటారు. కూడా వెళ్ళి ఒక కంట కనిపెడుతూ ఉండు. తప్పదు." అనేసరికి మర్నాడు పిల్లకాకికి తెలియకుండా దానిని అనుసరించింది. అనుకున్నట్టుగానే పిల్ల కొంగ.. పిల్లకాకిని చేపల వేటకి నది దగ్గరకి తీసుకు వెళ్ళింది. వాళ్ల వెనుకే వెళ్ళిన

తల్లికాకి దగ్గర్లో చెట్ల కొమ్మల్లో దాగి వాటిని గమనించసాగింది.

పిల్ల కొంగ నది మధ్యలో ఉన్న చిన్న రాయి మీద ఒంటికాలి మీద నిలబడి పిల్లకాకిని అలా నిలబడమని చెప్పింది. పిల్లకాకి ఎంత ప్రయత్నించినా అలా నిలబడలేక అనేక అవస్థలు పడసాగింది.

అదే నదిలో ఉన్న ఒక పిల్ల మొసలి వీళ్ళిద్దర్నీ చూసింది. "అబ్బా. ఈ కాకి ఆహారంగా దొరికితే అమ్మ దగ్గర గొప్పలు పోవచ్చు. బహుశా అమ్మ కూడా ఎపుడూ కొంగమాంసమే తప్ప కాకి మాంసం తిని ఉండి ఉండదు" అనుకుని నోట్లో నీళ్ళు ఊరుతుండగా మెల్లగా వీటి వైపు రాసాగింది.

అది తెలియని కొంగపిల్ల ఒంటికాలి మీద ఎలా నిలబడాలో కాకిపిల్లకి చెబుతూనే ఉంది.

ఈలోపు పిల్ల మొసలి దగ్గరకంటా వచ్చేసి అవకాశం కోసం ఎదురు చూడసాగింది.. అది గమనించిన తల్లికాకి పిల్లలకు రాబోయే ప్రమాదాన్ని పసిగట్టి అరుచుకుంటూ అక్కడికి వచ్చేసింది. అది గమనించిన పిల్ల మొసలి ఇక ఆలస్యం చేయకూడదని గబుక్కున వాటి మీదకి ఒక్క దూకు దూకింది. దాంతో అలవాటైన కొంగ పిల్ల గబుక్కున ఎగిరి తప్పించుకుంది. పిల్లకాకి కాలి వేలు మాత్రం మొసలి నోటికి చిక్కిపోయింది. దాంతో తల్లికాకి పిల్లని ఎలాగైనా రక్షించుకోవాలని తన కాళ్లతో మొసలి మూతి మీద బలంగా గీరుతూ "బలంగా పైకెగురు...పైకెగురు" అని పిల్లకాకికి వినిపించేలా అరవసాగింది.

తల్లి అరుపులతో పిల్లకాకి ఒక పక్క ఏడుస్తూనే తన రెక్కల్లోకి బలం అంతా తెచ్చుకుని పైకి ఎగరటానికి ప్రయత్నించింది. ఈలోపు కాకి తన్నిన తన్నులతో.. పిల్ల మొసలి లేత మూతికి గాయాలు అయ్యాయి. దాంతో భయపడిపోయిన పిల్ల మొసలి పిల్లకాకిని వదిలేసింది.

దాంతో తల్లికాకి, పిల్లకాకి గోల గోలగా అరుచుకుంటూ ఇంటి దారి పట్టాయి. దార్లో..

"ఆహారం వెదుక్కునేటప్పుడు వచ్చే ప్రమాదాలు ఎవరివి వాళ్లకే తెలుస్తాయి. కొంగ ఆహారం అదే కాబట్టి గబుక్కున అది ఎగిరిపోయి ప్రమాదం బారి నుండి బయటపడింది. అసలు నీకు మన ఆహారం గురించి ఏమి తెలుసని? ఏమి తిన్నావని? పైగా ఒక్క రోజు వచ్చి ఎవరో వదిలేసినవి అని ఎద్దేవా చేసావు. వదిలేసినవే కావచ్చు. కానీ అలాంటి ఆహారంలో ప్రమాదాలు తక్కువ. ఎవరి ఆహారం, అలవాట్లు వారిని క్షేమంగా ఉంచుతాయి. నీకు అనుభవం లేదు. ఆలోచన లేదు. సమయానికి నేను రాబట్టి సరిపోయింది. లేదంటే ఎంత ప్రమాదం జరిగి ఉండేది" అంది తల్లికాకి చిరుకోపంతో..

"అవునమ్మా..! నేను నీ మాట విని ఉంటే వేలు పోగొట్టుకుని ఉండేదాన్ని కాదు. అయినా నా ప్రాణమే కాదు నా స్నేహితురాలి ప్రాణం కూడా కాపాడావు" అంది పిల్లకాకి. సరిగ్గా అప్పుడే పిల్లకొంగను తీసుకుని అక్కడికి వచ్చిన తల్లికొంగ అది విని..

"అవును. మీ అమ్మకి ముందే తెలుసు ఇలాంటి ప్రమాదం ఏదో జరుగుతుందని. అందుకే మీకు అలవాటు లేని పని నువ్వు చేస్తానంటే నిన్ను ఒక కంట కనిపెట్టుకుని ఉండి నీతో పాటు నా పిల్లనూ కాపాడింది." అని తల్లికాకి వైపు తిరిగి "మీలాంటి వాళ్లు చెట్టుకి ఒక్కరు ఉన్నా చెట్టు మీద నివశించే పక్షులన్నీ క్షేమంగా ఉంటాయి" అని వెళ్ళిపోయింది.

"ఇకనుండీ నువ్వేది పెడితే అదే తింటానమ్మా.." అంటూ పిల్లకాకి తల్లిని గర్వంగా చూసింది.

దాంతో.. "కొత్త ఆహారమే కాదు, స్నేహాలూ మంచివే. కానీ ఎవరి పరిధి వారిదే. అది తెలిసేంతవరకూ జాగ్రత్తగా ఉంటే చాలు.." అంది తల్లికాకి పిల్లని దగ్గరకి తీసుకుంటూ..

– కన్నెగంటి అనసూయ

# CENTRAL BOOKS

SINCE 1947

Your trusted Academic Partner - Then, Now & Forever

## DIAMOND JUBILEE

CELEBRATING 75 YEARS OF KNOWLEDGE, TRUST & LEADERSHIP



| | | | | | |
|---|---|---|---|---|---|
| 12 lakhs + Customers | 700+ Schools | 15 Business Awards | Online Services | Digital Learning | Books and Stationery Supplies |

**Head Office :** 6-3-553,C1, Quena Square, Erramanzil, Somajiguda, Hyderabad. Tel: 040-24098282

Regd. Office : Central Book Shop #5-9-186, Chapel Road, Abids, Hyderabad.

Warehouses: Plot No. P9/20, Sy. No. 81, IDA, Nacharam, Uppal Mandal, Medchal, Malkajgiri Dist.
Plot No: 1/5B, TSIIC Industrial Development Area, Nacharam, Medchal Dist., Hyderabad.

www.centralbooks.in

BALA CHELIMI, Telugu Children's Monthly Magazine
Date of Publication - January 2024

RNI Regn. No. 52828/92 TC No. TEL Tel01232

Oxford
Grammar High School

KNOWLEDGE IS POWER

OGS JUNIORS
grow naturally

43rd YEARS OF MERITORIOUS PERFORMANCE



**We make school time the best time for your kids**

At OGS Juniors, all the children are given a warm, safe, and stimulating environment so that they can grow to become individuals while exploring, imagining, creating, and playing.

- Loving atmosphere & play ground
- CCTV surveillance
- Certified teachers & caring staff
- Kids zone & play area
- Interactive & Value based Learning

**CARING TEACHERS & STAFF**
Your child will get the best care and attention

**ECO-FRIENDLY PRACTICES**
We let the children play with nature friendly material

**HUGE PLAYGROUND**
Your child will get lots of fresh air and playtime

**INTERACTIVE LEARNING**
Our trusted method helps your child communicate and learn with ease.

**Street No. 13, Himayathnagar, Hyderabad | Ph : 040 2763 6214, 99590 20512**

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, H.No.1-9-1126/B, Azamabad, Musheerabad, Hyderabad-500020, Telangana State.
Published at "CHANDRAM", # 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana.
Editor: Manikonda Vedakumar. RNI Reg No. 52828/92, Tc No: TEL Tel01232.
Cell : 9030626288, Mail ID : edit.chelimi@gmail.com